# చరిత్రలో నిల్చిపోయేలా ఉజ్జయినీ మహాకాళీ బోనాలు

-అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
-విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదు
-జేబుదొంగల ఫోటోలు ఫ్లెక్సీలు వేయించాలంటూ పోలీసులకు సూచన
-మంత్రి కొండా సురేఖ



శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో బోనాల జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కొండా సురేఖ, తదితరులు.

**బేగంపేట జులై 10, ప్రభాతవార్త**

చరిత్రలో నిల్చిపోయే విధంగా ఈ ఏడాది లష్కర్ లో (ఆషాడ బోనాలు) శ్రీఉజ్జయినీ మహాకాళీ బోనాల ఉత్సవాలను నిర్వహిస్తామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. దీనిలో భాగంగా అన్ని ముఖ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. విధి నిర్వహణలో అలక్ష్యం వహిస్తే సహించేదిలేదన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో ఆషాడ బోనాల జాతర 2026 అన్ని ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల తో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ ముందుగా శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జాతర సందర్భంగా పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా, డ్రైనేజీ పొంగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. పారిశుధ్యం అనునిత్యం పర్యవేక్షించాలి. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలి. వాటర్‌ప్యాకెట్లు వద్దు వాటి స్థానంలో వాటర్ బాటిల్స్ ఇవ్వాలి. జేబు దొంగల ఫోటోలు ఫ్లెక్సీల రూపంలో ఏర్పాటు చేయాలి. శివసత్తులు, చంటిపిల్లలతో వచ్చే వారు, వికలాంగులు, వృద్దులు, ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. రాజకీయాలకు అతీతంగా అమ్మ వారి బోనాలను నిర్వహించాలన్నారు. గత ఏడాది ప్రభుత్వం తరుపున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా బోనాలు నిర్వహించామని గుర్తు చేసారు. బోనాల ఉత్సవాల నేపథ్యంలో అమ్మ వారి దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేసామన్నారు. బోనాలతో వచ్చే మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తూ, ప్రభుత్వ పరంగా అన్ని శాఖల అధికారులను సమాయత్తం చేస్తున్నట్లు తెలిపారు. బోనాలతో వచ్చే మహిళలకు ప్రత్యేక క్యూలైన్లతో పాటు వయో వృద్దులకు, ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేసారు. ఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని రకాలైన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. దేవాలయానికి వచ్చే గల్లీలను బ్లాక్ చేయవద్దని సుభాష్ రోడ్డు నుంచి రాంగోపాల్‌పేట పాత వరకు గల్లీలన్నీ ఓపెన్ ఉంచాలని, దక్కన్ మానవ సేవా సమితి మంత్రికి విజ్ఞప్తి చేసారు. ఫలాహారం బండ్ల వారికి దేవాలయం వరకు అనుమతించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ తో పాటు దేవాదాయ శాఖ కమీషనర్ హనుమంతరావు, డీసీపీ సికింద్రాబాద్ జోన్ రక్షిత మూర్తి, సికింద్రా బాద్ జోనల్ కమీషనర్, ఇన్స్‌పెక్టర్ శ్రీదేవి, ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి మంగతాయారు. మాజీ ఎన్‌డీఎమ్ఏ ఉపాధ్యక్షులు మర్రి శశిధర్‌రెడ్డి, సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇం చార్జ్ డా. కోటనీలిమ దేవాదాయ శాఖ, పోలీసు, ట్రాఫిక్ వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# తడి చెత్త శాశ్వత నిర్వహణకు 'ఎరోబిన్ కంపోస్ట్ హార్వెస్ట్'

**హైదరాబాద్, జులై 10 ప్రభాతవార్త**

తడి చెత్త శాశ్వత నిర్వహణ కోసం 80 ఎరోబిన్ కంపోస్ట్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. ఎంఎంసి, మోడరన్ ఆర్కిటెక్ట్స్ ఫర్ రూరల్ ఇండియా, స్వర్ణలత మదర్సన్ ట్రస్ట్ సంయుక్త భాగస్వామ్యంతో శుక్రవారం బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని మై విల్లాస్ గేటెడ్ కమ్యూనిటీలో ఏర్పాటు చేసిన "ఎరోబిన్ కంపోస్ట్ హార్వెస్ట్" కార్యక్రమాన్ని కమిషనర్ వినయ్ కృష్ణరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఎంసి జోనల్ కమీషనర్ రాధికా గుప్త, అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ తదితరులు పాల్గొన్నారు. కాగా, కొత్తగా ఏర్పాటు చేసిన ఎరోబిన్ కంపోస్టర్ల నుండి వచ్చిన అత్యాధునిక సేంద్రీయ ఎరువును అక్కడ ఉన్న నివాసితులకు, అధికారులకు పంపిణీ చేశారు. ఎరోబిన్ కంపోస్టర్ ద్వారా తడి చెత్తను ప్రాసెస్ చేయడానికి సమర్థవంతమైన ఆధునిక పద్ధతని, దీనికి విద్యుత్ ఏమాత్రం అవసరం లేకుండా, పూర్తిగా సహజమైన ఎరోబిక్ ప్రక్రియతో ఈ యూనిట్ పనిచేస్తుందని ఈ సందర్భంగా కమిషనర్ పేర్కొన్నారు. దీనివల్ల ఎలాంటి దుర్వాసన రాకుండా, ఈగలు, దోమలు, ఎలుకల బెడద లేకుండా తడి చెత్తను ఎరువుగా మార్చవచ్చున్నారు. ఎంఎంసి దీర్ఘకాలిక ప్రణాళికలను వివరిస్తూ, రాబోయే దశలో మున్సిపల్ సర్కిల్ అధికారులు, కమ్యూనిటీ ప్రతినిధులకు తడి చెత్తని నిర్వహించడానికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మై విల్లాస్ ప్రెసిడెంట మధుసూదన్ మాట్లాడుతూ, తమ కమ్యూనిటీలో 200 పైగా ఇళ్లు ఉండగా 150 యాక్టివ్ కుటుంబాలు ఉన్నాయని, వీటి ద్వారా రోజుకు దాదాపు 45 నుండి 50 కిలోల తడి చెత్త వస్తుందని తెలిపారు. మై విల్లాస్‌లో ప్రతిరోజూ 60,000 లీటర్ల మురుగునీటిని శుద్ధి చేస్తోంది, అందులో కేవలం 10,000 లీటర్లను మాత్రమే అంతర్గత అవసరాలకు వాడుకుంటూ, మిగిలిన అదనపు శుద్ధి చేసిన నీటిని మున్సిపాలిటీకి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.



ఎరోబిన్ కంపోస్ట్ హార్వెస్ట్' ప్రారంభిస్తున్న ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణరెడ్డి, చిత్రంలో జోనల్ కమీషనర్ రాధికా గుప్త, అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్ తదితరులు



# హైదరాబాద్ వార్త

# దుష్ప్రచారం నమ్మొద్దు..
# పేదలజోలికి హైడ్రా వెళ్లదు

-ఎంఎస్, బిఎస్ మక్తావాసులకు కమిషనర్ రంగనాథ్ అభయం

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:**

ఖైరతాబాద్, రాజ్‌భవన్ ఎదురుగా హుస్సేన్ సాగర్‌కు ఆనుకుని ఉన్న ఎంఎస్ మక్తా, బీఎస్ మక్తా నివాసితులకు హైడ్రా భరోసా ఇచ్చింది. పేదల ఇళ్లను కూల్చేది లేదని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయా ప్రాంతాలను కమిషనర్ సందర్శించి స్థానికులతో నేరుగా మాట్లాడారు. హుస్సేన్ సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తున్న ఇళ్లను హైడ్రా తొలగిస్తుందని చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని.. కబ్జాదారులు కొంతమంది స్వార్థ ప్రయోజనాలకు మిమ్ములను ఉపయోగించుకుంటున్నారని వారి మాటలు నమ్మవద్దని హితవు పలికారు. హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఇళ్లకు హైడ్రా నోటీసులని తప్పుడు ప్రచారం చేయడమే కాకుండా.. అమాయకులను ముందు పెట్టి నెక్లెస్ రోడ్డులోని ఎంఎంటీఎస్ స్టేషన్ వద్ద ఆందోళన చేయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంలో స్పష్టత ఇద్దామనే తాను ఇక్కడికి వచ్చానని రంగనాథ్ వారితో చెప్పారు. పేద ప్రజల ఇళ్లను కూల్చే ఉద్దేశం ప్రభుత్వానికి హైడ్రాకు లేదని తెలిపారు. హైడ్రా ఏర్పాటుకు ముందే ఉన్న నివాసాల విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కమిషనర్ స్పష్టం చేశారు. అంబర్‌పేటలోని బతుకమ్మకుంట చెరువు పునరుద్ధరణలో కూడా పేదల నివాసాల జోలికి వెళ్లకుండానే అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బతుకమ్మకుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నా ఇప్పటికే నివాసులున్న వాటిని మినహాయించామన్నారు. రామంతాపూర్ పెద్ద చెరువు పరిధిలో కూడా పేదలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటే.. వారిని ఖాళీ చేయించి డబుల్‌బెడ్ రూం ఇళ్లు మంజూరుకు సిఫారసు చేశామన్నారు. హైడ్రా కమిషనర్ వివరంగా చెప్పడంతో స్థానికులు ఊరట చెందారు.



స్థానికులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

# బిఎల్‌వోలు రోజు వంద ఎన్యూమరేషన్ ఫారాలు డిజిటలైజ్ చేయాలి

-బూత్‌లెవల్ సూపరవైజర్లు 1000 ఫారాలను సేకరించాలి
విధుల్లో పురోగతి లేకుంటే ఈఆర్‌వోలకు షోకాజ్ నోటీసులు
-జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్



చిలకలగూడ హమాలీబస్తీలో బిఎల్‌వోల పనితీరును పరిశీలిస్తున్న ఆర్.వి.కర్ణన్ తదితరులు

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:**

బిఎల్‌వోలు రోజుకు 100 ఫారాలను డిజిటలైజేషన్ చేయాలనిఅలాగే బూత్ లెవల్ సూపర్వైజర్లు రోజుకు వెయ్యి ఫార్మ్యాలను సేకరించాలని జిల్లా ఎన్నికల అధికారి ఆర్. వి. కర్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు శుక్రవారం భారత ఎన్నికల సంఘం అన్ని జిల్లా ఎన్నికల అధికారులు ఎస్ఐఆర్ పరిశీలకులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించింది. అలాగే డిజిటైజేషన్‌లో తక్కువ పురోగతి కనబరుస్తున్న ఎన్నికల నమోదు అధికారులకు (ఈఆర్‌వో) షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సూచించింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్. వి. కర్ణన్ ఈఆర్‌వోలతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కార్యక్రమం కింద ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పురోగతి, ఫారాల సకాలంలో పూర్తి చేయడం, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ అమలుపై సమగ్రంగా సమీక్షించారు. ఈసందర్భంగా సనత్‌నగర్, ముషీరాబాద్ మరియు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో డిజిటైజేషన్ పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడంపై కమిషనర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసి సంబంధిత ఈఆర్‌ఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు, పనితీరు మెరుగుపరచకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో నిర్లక్ష్యం లేదా జాప్యాన్ని ఏ మాత్రం సహించబోమని, బాధ్యులపై తగిన పరిపాలనా చర్యలు తప్పకుండా తీసుకుంటామని స్పష్టం చేశారు.

**చిలకలగూడలో ఆకస్మిక తనిఖీ..**

జిల్లా ఎన్నికల అధికారిఆర్. వి. కర్ణన్ చిలకలగూడ పరిధిలోని హమాల్‌బస్తీ పోలింగ్ స్టేషన్ నెం. 32ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల జాబితా సవరణ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. మరణించిన ఓటర్ల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించే ప్రక్రియలో భాగంగా సంబంధిత మరణ ధ్రువపత్రాలను సేకరించాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాల సేకరణలో బూత్ లెవల్ ఆఫీసర్లకు, ఏజెంట్లు సమన్వయంతో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, జోనల్ కమిషనర్ కె.ఎ. మంగతాయారు, ఈఆర్‌వో ఎం.ఎన్.ఆర్. జ్యోతి, డిప్యూటీ కమిషనర్, మెట్టుగూడ ఎన్. సాయి బాబా, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ఎం. నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# 30 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ

**హైదరాబాద్ జులై 10 ప్రభాతవార్త**

హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీగా ఇన్‌స్పెక్టర్ల బదిలీలు చేపట్టారు. 30 మంది ఇన్‌స్పెక్టర్లను వివిధ విభాగాలు, పోలీస్ స్టేషన్లకు బదిలీ చేశారు. ఈ మేరకు హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం గాంధీనగర్, చిక్కడపల్లి, అత్తాపూర్, సైఫాబాద్, చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, బోరబండ, పంజాగుట్ట, మాదన్నపేట, ఆదిబట్ల తదితర పోలీస్ స్టేషన్లలో ఎస్‌హెచ్‌వోలను మార్చారు. అలాగే ట్రాఫిక్ అడ్మిన్, సైబర్ క్రైమ్స్, సెక్రటేరియట్ సెక్యూరిటీ, ఉమెన్ సేఫ్టీ వింగ్, ఐటీ సెల్, స్పెషల్ బ్రాంచ్ వంటి విభాగాలకు పలువురు ఇన్‌స్పెక్టర్లను నియమించారు. బదిలీ అయినవారు తక్షణమే రిలీవ్ అయ్యి, కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## బదిలీల వివరాలు...

గాంధీనగర్ ఎస్‌హెచ్‌వోగా సీహెచ్ సురేశ్‌బాబు, ట్రాఫిక్ అడ్మిన్‌గా ఎన్. బోస్ కిరణ్, సీఎం నివాస భద్రత విభాగానికి ఎం. మల్లేశం, చిక్కడపల్లి ఎస్‌హెచ్‌వోగా ఎల్. మధుబాబు, అత్తాపూర్ ఎస్‌హెచ్‌వోగా ఎ. సీతయ్య, సైఫాబాద్ ఎస్‌హెచ్‌వోగా కె. నాగేశ్వర్‌రావు, సీసీఎస్ (డీడీ)కి టి. అశోక్‌కుమార్, లాలాగూడ ఎస్‌హెచ్‌వోగా బి. రవికిరణ్, సచివాలయ భద్రత విభాగానికి ఆర్. గోపి, చాంద్రాయణగుట్ట ఎస్‌హెచ్‌వోగా ఆర్. రవీందర్, ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు బి. సత్యనారాయణ, మైలార్‌దేవ్‌పల్లి ఎస్‌హెచ్‌వోగా సి. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్‌కు ఈ. జంగయ్య, ఫలక్‌నుమా ఎస్‌హెచ్‌వోగా ఎం. అప్పలనాయుడు, స్పెషల్ బ్రాంచ్‌కు ఎన్. శ్రేయ, రాజేంద్రనగర్ మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా పి. నవీన్‌కుమార్, సైబర్ క్రైమ్స్‌కు ఎం. సురేందర్, బోరబండ ఎస్‌హెచ్‌వోగా బి. రవికుమార్, ఐటీ సెల్‌కు ఎం. రామకృష్ణ, పంజాగుట్ట ఎస్‌హెచ్‌వోగా ఈ. జహంగీర్ యాదవ్, స్పెషల్ బ్రాంచ్‌కు జి. హరీశ్, బహదూర్‌పురా ఎస్‌హెచ్‌వోగా టి. శ్రీనాథ్‌రెడ్డి, ఆర్‌జీఐఏ అవుట్‌పోస్ట్ ఎస్‌హెచ్‌వోగా బి. కిరణ్‌కుమార్, సీఎస్‌డబ్ల్యూకు బి. మురళీధర్, మాదన్నపేట ఎస్‌హెచ్‌వోగా ఎస్‌కే. ముజీబ్‌ఉర్‌రెహమాన్, ట్రాఫిక్ అడ్మిన్‌గా పి. అంజనేయులు, కాచిగూడ డీఐగా కె. ఎం. రాఘవేంద్ర, గోషామహల్ టీటీఐగా ఎండీ. షకీర్ అలీ, ఆదిబట్ల ఎస్‌హెచ్‌వోగా ఎస్. రమేష్, మలక్‌పేట్ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వోగా కె. ఆదిరెడ్డి బదిలీ అయ్యారు.

# డ్రగ్స్, నాన్‌డ్యూటి పెయిడ్ లిక్కర్‌పై దృష్టి

-ముమ్మరంగా తనిఖీలు..ముఠాలకు చెక్ -సైబరాబాద్ డిప్యూటి కమిషనర్ హరికిషన్



ఎక్సైజ్‌భవన్‌లో మాట్లాడుతున్న హరికిషన్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:**

డ్రగ్స్, నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్‌ను రాకుండా, లేకుండా చేయాలని ఎక్సైజ్ యంత్రాంగానికి సైబరాబాద్ డిప్యూటి కమిషనర్ జె. హరికిషన్ ఆదేశించారు. శుక్రవారం అబ్కారీ భవన్ సమావేశ మందిరంలో తొలిసారిగా సైబరాబాద్ ఎక్సైజ్ అధికారులతో డిప్యూటి కమిషనర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ రెవెన్యూతో పాటు నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్ వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని, అనాథైరైజ్డ్ లిక్కర్‌పై తనిఖీలు చేపట్టాలని, మద్యం అమ్మకాల్లో లీకేజీలను అరికట్టాలని, ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తు మంచి ఫలితాలను తీసుకరావాలని డిప్యూటి కమిషనర్ హరికిషన్ అదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో సైబరాబాద్ అసిస్టెంట్ కమిషనర్ జి. శ్రీనివాసరెడ్డి, షేర్ లింగంపల్లి ఈఎస్ రాధకృష్ణ, కుత్బుల్లాపూర్ ఈఎస్ ఆర్. ప్రవీణ్‌ల తోపాటు సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

**బార్డర్లపై నుంచి వస్తున్న నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్ స్వాధీనం..**

ఎక్సైజ్‌శాఖ బార్డర్లపై వస్తున్న నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్‌ను పెద్ద మొత్తంలో పట్టుకున్నారు. చార్మినార్ ఉప్పుగూడ ప్రాంతంలోని మహాంకాళి టెంపుల్ శివసాయినగర్ లో హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ చంద్రశేఖర్ గౌడ్ సిబ్బంది కలిసి 14 డిఫెన్స్ మద్యం బాటిళ్లను పట్టుకొని శివారెడ్డి అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. నిందితుడిని, మద్యం బాటిళ్లను చార్మినార్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. నారాయణపేట్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో తెలంగాణ కర్ణాటక బార్డర్ వద్ద ఎక్సైజ్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో కర్ణాటకు చెందిన 22 బీరు బాటిళ్లను, 10 మద్యం బాటిళ్లు(180 ఎంఎల్) స్వాధీనం చేసుకున్నారు. 1.80 లీటర్ల వైన్‌ను కూడ స్వాధీనం చేసుకున్నారు. 13 టేట్రా ప్యాకెట్ వీస్కిని పట్టుకున్నారు. గద్వాల జిల్లా నెట్టెంపాడు ముసులోని దొడ్డి ప్రాంతంలో కర్ణాటక నుంచి తెలంగాణకు వస్తున్న 0.720 లీటర్ల టెట్రా వీస్కి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలోకి కర్ణాటక, గోవా ప్రాంతాల నుంచి వచ్చిన బస్సులను ఎక్సైజ్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 30 ఎన్‌డీపీఎల్ గోవా ప్రాంతానికి చెందిన మద్యం బాటిళ్లను బస్సు నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కార్ణటకకు చెందిన బి. శంకర్‌ను అదుపులోకి తీసుకోని కేసు నమోదు చేశారు.

# గచ్చిబౌలిలో అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం

-యువతి మృతి, మరో యువతికి తీవ్రగాయాలు

**గచ్చిబౌలి, జులై 10 ప్రభాతవార్త :** నగరంలోని ఐటీ కారిడార్ పరిధిలో రోడ్డు ప్రమాదాల పరంపర కొనసాగుతోంది. వరుస రోడ్డు ప్రమాదాలతో ఐటీ కారిడార్ నిత్యం రక్తసిక్తమవుతుంది. తాజాగా గురువారం అర్ధరాత్రి గచ్చిబౌలిలో మరో ఘోరరోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్కూటర్‌పై వెళుతున్న ఇద్దరు యువతులను వేగంగా దూసుకువచ్చిన వాటర్ ట్యాంకర్ ఢీకొట్టడంతో యువతి అక్కడిక్కడే మృతిచెందగా, మరో యువతి తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబందించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా కాత్రేపల్లి మండలం కేసముద్రం గ్రామానికి చెందిన మల్లం భవాని (23) నగరానికి వచ్చి గచ్చిబౌలి లోని గోకలర్స్ షాప్‌లో సేల్స్‌గర్ల్‌గా పనిచేస్తూ ఇందిరానగర్‌లోని హస్టల్‌లో నివాసం ఉంటుంది. ఇదే షాప్‌లో పనిచేస్తూ అంజయ్య నగర్ లక్ష్మీ హాస్టల్‌లో నివాసం ఉండే ఎస్. సుభాషిణి (30)తో స్నేహం ఏర్పడింది. ఇద్దరు కలిసి హోండా యాక్టివా (టీజీ07హెచ్2593)పై గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీ నుంచి అంజయ్యనగర్ వైపు రాత్రి 11:30 గంటల ప్రాంతంలో వెళుతున్నారు. మార్గమధ్యలో వీరి స్కూటిని వేగంగా, నిర్లక్ష్యంగా దూసుకువచ్చిన వాటర్ ట్యాంకర్ (టీజీ 07 వీ48 26) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన మల్లం భవాని అక్కడిక్కడే మృతిచెందగా, సుభాషిణికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన సుభాషిణిని చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతి చెందిన మల్లం భవాని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ప్రమాదానికి కారణమైన వాటర్ ట్యాంక్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మూసీ పరీవాహక ప్రాంతంలో అగ్ని ప్రమాదం

-భారీ ఎత్తున వ్యాపించిన మంటలు
- పూర్తిగా దగ్ధమైన పలు షాపులు
-భయాందోళనలకు గురైన స్థానిక ప్రజలు



ఉవ్వెత్తున ఎగసిపడుతున్న మంటలు దృశ్యం



సంఘటన ప్రాంతాన్ని సందర్శించిన ఎమ్మెల్యే అహ్మద్ బలాల తదితరులు

**మలక్ పేట, జులై 10, ప్రభాతవార్త:**

చాదర్ ఘాట్ మూసి పరివాహక ప్రాంతం వెంబడి ఉన్న ఫంక్షన్ డెకరేషన్ గోదాములు, కార్ మెకానిక్ షెడ్లు, వాణిజ్య సముదాయాలలో అగ్ని ప్రమాదం సంభవించిన సంఘటన చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం చాదర్ ఘాట్ మూసి పరివాహక ప్రాంతం వెంబడి కమల్ నగర్ బస్తీ ప్రాంతంలో ఫంక్షన్ డెకరేషన్ గోదాములు, కార్ మెకానిక్ షెడ్లు, వాణిజ్యసముదాయాలలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి చాదర్ ఘాట్ పోలీసులకు సమాచారం అందించగా, చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మమురారి వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి సంఘటన ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలను చేపట్టారు. మంటలు పెద్ద ఎత్తున వ్యాపించి సమీపంలోని ఫంక్షన్ డెకరేషన్ గోదాములు, కార్ మెకానిక్ షెడ్లు వాణిజ్య సముదాయాలులోకి మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది సుమారు ఏడు అగ్నిమాపక సకటాలు సంఘటన ప్రాంతానికి చేరుకుని గంట పాటు తీవ్రంగా శ్రమించి మంటలను ఆర్పి వేశారు. మంటలను ఆర్పి వేసిన తర్వాత కూలింగ్ ఆపరేషన్ చర్యలు ప్రారంభమయ్యాయి. పెద్ద ఎత్తున వ్యాపించిన మంటలలో పలు షాపులు పూర్తిగా కాలిపోయాయి. ఎటువంటి ప్రాణానష్టం సంభవించలేదని సంబంధిత అధికారులు తెలిపారు. ఎంత మేర ఆస్తి నష్టం సంభవించిందనేగ విషయం ఇంకా తెలియలేదని పేర్కొన్నారు. సంఘటన ప్రాంతాన్ని సౌత్ జోన్ డిసిపి కిరణ్ కరె ప్రభాకర్, జిల్లా ఫైర్ అధికారి తగరం వెంకన్న, మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, ఏసీపీ రాజా వెంక రెడ్డి తదితరులు సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా డిసిపి కిరణ్ కరె ప్రభాకర్ మాట్లాడుతూ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ముమ్మరంగా సహాయక చర్యలను చేపట్టడం జరిగిందని, మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయని తెలిపారు. ఎటువంటి ప్రాణ నష్టం సంభవించలేదని, ఆస్తి నష్టం వివరాలు ఇంకా తెలియలేదని పేర్కొన్నారు. అగ్ని ప్రమాదం సంభవించడానికి గల కారణాల గురించి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు వదంతులు పుకార్లు నమ్మవద్దని సూచించారు. మూసి పరివాహక ప్రాంతంలోని కమల్ నగర్ బస్సులో పెద్ద ఎత్తున అగ్ని ప్రమాదం సంభవించడంతో స్థానిక ప్రజలు భయాందోళన గురయ్యారు.

## ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును పరామర్శించిన కెటిఆర్


శంభీపూర్ రాజుతో మాట్లాడుతున్న కేటీఆర్

**దుండిగల్, జూలై 10, ప్రభాతవార్త**
ఇటీవల వరంగల్ జిల్లా కన్నెపల్లి రిజర్వాయర్ పర్యటనకు వెళ్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం శంభీపూర్‌లోని ఆయన నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా శంభీపూర్ రాజు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న కేటీఆర్, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను తెలుసుకుని అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, మాధవరం కృష్ణారావు, బీఆర్ఎస్ పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు నందికంటి శ్రీధర్, గజ్జెల నాగేశ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## బహదూర్‌పల్లిలో ఫుట్‌పాత్ ఆక్రమణలపై ఉక్కుపాదం


ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

**దుండిగల్, జూలై 10, ప్రభాతవార్త**
పాదచారుల భద్రత, ట్రాఫిక్ సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బహదూర్‌పల్లి పరిధిలో మున్సిపల్ అధికారులు శుక్రవారం ప్రత్యేక ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఈ సందర్భంగా మొత్తం 42 అక్రమ నిర్మాణాలను తొలగించారు. బహదూర్‌పల్లి చౌరస్తా నుంచి దూలపల్లి రోడ్డులోని ఎస్‌వీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వరకు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మించిన షెడ్లు, తాత్కాలిక నిర్మాణాలను అధికారులు తొలగించారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణల వల్ల పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో పాటు రోడ్డు ప్రమాదాలకు అవకాశం ఏర్పడుతోందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూములు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసిన అధికారులు, భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. పాదచారుల సౌకర్యం కోసం ఫుట్‌పాత్‌లను ఖాళీగా ఉంచాలని స్థానిక వ్యాపారులకు సూచించారు. నగరంలో ఆక్రమణల తొలగింపు కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్, ఏసీపీ శ్రీనివాస్, టీపీఎస్ ముఖేష్ సింగ్, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు న్యాయం చేయాలి : రూబీ స్టీవెన్ సన్


అంబర్‌పేట తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంబర్‌పేట టీజేఏసీ కన్వీనర్ గుడిసె రూబీ స్టీవెన్‌సన్ తదితరులు

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త**
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం త్యాగాలు చేసిన ఉద్యమకారులను గుర్తించి వారికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతూ అంబర్‌పేట టీజేఏసీ కన్వీనర్ గుడిసె రూబీ స్టీవెన్ సన్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారులు శుక్రవారం అంబర్‌పేట తహసిల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా రూబీ స్టీవెన్ సన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో అంబర్‌పేట ఉద్యమకారులు అంబర్‌పేట నుండి అదిలాబాద్ జిల్లా నిర్మల్ వరకు 360 కిలోమీటర్లు పాదయాత్ర చేశారని తెలిపారు. కేవలం తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా తాము చేసిన పాదయాత్రకు ప్రభుత్వ పరంగా తగు గుర్తింపు లభించాలని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం చెప్పినట్లు తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, 25 వేల రూపాయల పెన్షన్, ఆరోగ్య బీమా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర సాధనే తమ జీవిత లక్ష్యంగా పనిచేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం పథకాల అమలులో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తహసిల్దార్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో జేఏసీ నాయకులు జహంగీర్, సూర్యవంశీ, వర్కాల శ్రీకాంత్, వెంకటేష్, ఆలంపల్లి రవి తదితరులు ఉన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో పాఠ్యపుస్తకాలు, పలకల పంపిణీ


చిన్నారులకు పలకలు పంపిణీ చేసిన మాజీ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

**జూబ్లీహిల్స్, జూలై 10, ప్రభాతవార్త:**
ఫిల్మ్‌నగర్‌లోని జ్ఞానీజైల్‌సింగ్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు జూబ్లీహిల్స్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పలకలు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. వెల్దండ వెంకటేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆయన ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. చిన్నారులతో కలిసి వారి మధ్యలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారులతోపాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సైన్సు రంగాలలో చురుకుగా పాల్గొనాలి



**చార్మినార్. జూలై 10.ప్రభాతవార్త :** కాట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన పదకొండు మంది యంగ్ సైంటిస్టులు శుక్రవారం మలేషియాలోని అంతర్జాతీయ విజ్ఞా కేంద్రా స్నీ తిలకించిటానికి వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడమీ చైర్మన్ డాక్టర్. మొహ్మద్ అన్వర్ మాట్లాడుతూ సైన్స్ రంగాలలో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని కోరారు. ఎం.ఎస్. ఎడ్యుకేషన్ డైరెక్టర్ మొహ్మద్ అన్వర్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో కాట్ ప్రతినిధులు మస్తాన్ అలీ. వికారుద్దీన్ తో పాటు పలువురు పాల్గొన్నారు. కాగా ఎంపికైన 11మంది యంగ్ సైంటిస్ట్ లను అభినందించారు.

## అభిషేక్ అడపా ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ కార్యక్రమం వేగవంతం


బేగంపేట కమ్యూనిటీ హాలులో ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న అభిషేక్, షేక్‌గౌస్, అడ్డు.

**బేగంపేట జులై 10,ప్రభాతవార్త**
ప్రభుత్వం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయడం వల్ల ప్రజలకు వీలైనంత తొందరగా సేవలు అందించాలని భావించిన సనత్‌నగర్ నియోజకవర్గం బేగంపేట డివిజన్ కాంగ్రెస్ యువ నాయకుడు అభిషేక్ అడపా కొందరు యువకులకు ఎస్ఐఆర్ నమోదు పై శిక్షణ ఇప్పించడంతో పాటు వారికి తాను వ్యక్తి గతంగా ల్యాప్ ట్యాప్ లు ఇప్పించి బేగంపేట డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నమోదు, పరిశీలన సెంటర్లను ఏర్పాటు చేసారు. సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డా. కోట నీలిమ నేతృత్వంలో డివిజన్ ప్రజలకు ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని తీసుకున్నట్లు అభిషేక్ తెలియజేసారు. ఓల్డ్ కస్టమ్స్ బస్తీలోని కమ్యూనిటీహాలు, ప్రభుత్వ పాఠశాలతో పాటు బ్రాహ్మణవాడీ, వడ్డెరబస్తీ, మాతాజీ నగర్, ఎన్‌బీటినగర్ వాటర్ ట్యాంక్ వద్ద, కమ్యూనిటీ హాలులో, పాటిగడ్డ ఆటో స్టాండ్, బర్డన్ కాంపౌండ్, జవహర్ జనతాలలో ఈ సెంటర్లను ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి నిత్యం ప్రజలకు అందుతున్న సేవలను పర్యవేక్షిస్తున్నారు. గడచిన మూడు రోజులుగా పై బస్తీల్లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ లో సేవలు అందిస్తుండటంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. యువత ఇలాగే ముందుకు వచ్చి ఈ కార్యక్రమంలో పాలు పంచుకుంటే ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియ మరింత సులభమయ్యే అవకాశం ఉందని స్థానికులు కోరుకుంటున్నారు. ఈ సెంటర్లను నిత్యం అభిషేక్ అడపా, కాంగ్రెస్ సీనియర్ నాయకులు షేక్ గౌస్, శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయ ట్రస్ట్ బోర్డు మెంబర్ చెక్కల రాజేందర్, డివిజన్ అధ్యక్షుడు నసీరుద్దీన్ (అడ్డు), అల్లమాష్, ఆ యూబ్, సాయిబాబా, సువర్ణ, రాధ, చంద్రకళ తదితరులు అనునిత్యం పర్యవేక్షిస్తున్నారని అభిషేక్ అడపా తెలియజేసారు.

## వీనులవిందు ఎస్పీ ఆణిముత్యాల సినీసంగీత విభావరి


సత్కారం పొందిన గాయకులు రామ్, శారదాసాయి తదితరులతో నరసింహారెడ్డి, మాధవపెద్దిసురేష్ తదితర అతిథులు

**రవీంద్రభారతి, జూలై 10 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో స్వర్ణలహరి, ఆనందభైరవి సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఎస్పీబి80 శీర్షికన నిర్వహించిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 80వ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన సినీసంగీత విభావరి గ్రాండ్ మ్యూజికల్ ఈవెంట్ ప్రేక్షకుల హృదయాలకు హత్తుకుపోయి వీనులవిందు చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి, ప్రముఖ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్, విశిష్ట అతిథులు డా. జి.విజయ శ్రీనివాస్, ప్రముఖ అంతర్జాతీయ గాయని శారదసాయి, సంస్థ వ్యవస్థాపకుడు డి.రామ్ తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనం చేసి విభావరి లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. భారతీయ పలు భాషల్లో వేలాది పాటలను పాడి అందరి మదిలో పదిలస్థానం ఏర్పాటు చేసుకున్న విశ్వవిఖ్యాతి గాంచిన బాలసుబ్రహ్మణ్యం తెలుగువాడు కావడం, యావత్ తెలుగుజాతికే గర్వకారణం అన్నారు. ఈ సందర్భంగా గాయకులు డి.రామ్, శారదాసాయి తదితర వర్ధమాన గాయకులతో కలిసి ఎస్పీ బాలు వివిధ గాయకులతో ఆలపించి ఆణిముత్యాల్లాంటి వివిధ భాషా పాటలను సుమధురంగా ఆలపించి తన్మయుల్ని చేశారు. చివరిగా అతిథులు ఆయా గాయకులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.

## బహుజనుల రాజ్యాధికారమే ధ్యేయం: భేరి రామచందర్‌యాదవ్


బీసీ ఐక్యవేదికకు మద్దతు తెలిపిన నాయి బ్రహ్మణ సంఘ సభ్యులతో భేరి రామచందర్‌యాదవ్ తదితరులు

**శేరిలింగంపల్లి, జూలై 10 ప్రభాతవార్త**
బహుజనుల రాజ్యాధికారమే ధ్యేయంగా బీసీలు ఐక్యతతో పనిచేయాలని బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్‌యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీసీ కులాలలో ఐక్యత తీసుకువచ్చే క్రమంలో శేరిలింగంపల్లి నాయి బ్రహ్మణ సంఘం అధ్యక్షులు, మంగలి సాయిలుతో పాటు వారి కార్యవర్గ సభ్యులను బీసీ ఐక్యవేదిక నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీ ఐక్యకార్యచరణకు నాయి బ్రహ్మణ సంఘ సభ్యులు తమ సంపూర్ణమద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా బేరి రామచందర్‌యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు రాజ్యాధికారం దిశగా బీసీ ఐక్యవేదిక పనిచేస్తుందని, ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని బీసీ కుల సంఘాలతో కలిసి చర్చించటం జరుగుతుందన్నారు. అన్ని కులాల మద్దతు తెలుపడటం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని కుల సంఘాలను కూడగట్టడంతో అధికారం సాధిస్తామన్నారు. ముఖ్యంగా ముదిరాజ్, యాదవ్, పద్మశాలి, గౌడ్స్, మున్నూరు కాపు సంఘాలను కలవడం జరుగుతుందన్నారు. తెలంగాణలో కొన్ని కులాలకు ఇప్పటికీ గుర్తింపు లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో కులాల దామాష పద్దతిన ఎవరికి రావాల్సిన వాటా వారికి అందాలని డిమాండ్ చేశారు. విద్యతో సహా వైద్యం, ఉద్యోగం, సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కావాలని, అందుకు బీసీలు ఏకమై కలిసి పనిచేస్తామన్నారు. ఈకార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక నాయకులు సాయన్న ముదిరాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ హరికృష్ణ చారి, యువజన సంఘం అధ్యక్షులు కుమార్ యాదవ్, సాయి కురుమ, రాజుగౌడ్, పద్మశాలి, ఆశోక్, కిరణ్ ముదిరాజ్, రజక సంఘం మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## జనగణనలో కులగణన శాస్త్రీయంగా, సమగ్రంగా నిర్వహించాలి


ప్రధాని నరేంద్రమోదీకి లేఖను విడుదల చేస్తున్న బిసి నేతలు చిరంజీవులు, పూర్ణచంద్రరావు, బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు

**సైఫాబాద్, జూలై 10 ప్రభాతవార్త:** జనగణనలో కులగణను శాస్త్రీయంగా, సమగ్రంగా నిర్వహించాలని పలువురు బిసి మేధావులు, బిసి నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి, హోం శాఖ మంత్రి, రిజిస్ట్రార్ జనరల్, ఎంపిలకు వారు లేఖ రాయడం జరిగింది. ఈ అంశంపై వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎంపిలు చర్చించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా 'జనగణనలో కులగణన–మళ్లీ మోసపోతున్న బిసిలు' అనే అంశంపై బిసి మేధావుల ఫోరం ఛైర్మన్ టి.చిరంజీవులు, రాష్ట్ర మాజీ డిజిపి జె.పూర్ణచంద్రరావు, బిసి పొలిటికల్ ఫ్రంట్ ఛైర్మన్ బాలగొని బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు ఎస్.దుర్గయ్యగౌడ్, అయిలి వెంకన్నగౌడ్ తదితరులు మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న జనగణన ప్రి-టెస్టింగ్‌లో కూడా ప్రతి కులానికి ప్రత్యేక (యూనిక్) కోడ్ ఇవ్వకపోతే ఆదే తప్పులు తిరిగి పునరావృత్తం అవుతాయని వారు హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన తరహాలోనే ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ ఇవ్వాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి కులగణనను కేవలం పేరుకే కాకుండా ఖచ్చితమైన శాస్త్రీయమైన విధాన రూపకల్పనకు ఉపయోగపడే డేటాతో నిర్వహించాలని కోరారు. బిసిలను దేశంలో రాజకీయంగా నిర్లక్ష్యం చేస్తున్నారని, అందుకే వారి సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదని, జనగణన కోసం ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేస్తున్నప్పటికి బిసిలకు కోడ్ ఇవ్వకుండా నిర్వహిస్తే అది బిసిలకు ఉపయోగపడదన్నారు. రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించే విషయంలో కాంగ్రెస్ నాయకత్వం, ముఖ్యంగా రాహుల్‌గాంధీ స్పందించలేదని, కాంగ్రెస్, బిజెపిలు బిసిలకు పూర్తిగా న్యాయం చేయలేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా బిసిలంతా ఐక్యంగా కులగణన కోసం ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు.

## బస్తీ దవాఖానలో 8 నెలలుగా లేని డాక్టర్

**: మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ ఆగ్రహం**



**చిక్కడపల్లి జూలై 10 (ప్రభాతవార్త ) :** గాంధీనగర్ డివిజన్ పరిధిలోని అరుంధతి నగర్ బస్తీ దవాఖానలో గత ఎనిమిది నెలలుగా వైద్యులు అందుబాటులో లేకపోవడంపై స్థానిక మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేసారు. శుక్రవారం స్థానిక బస్తీ వాసులు ఫిర్యాదు చేయడంతో ఎ.పావని వినయ్ కుమార్ దవాఖానను సందర్శించారు. అక్కడ నెలకొన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వర్షాకాలం ప్రారంభమై వాతావరణ మార్పుల వల్ల అనేక సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో, పేద ప్రజలకు వైద్యం అందించాల్సిన బస్తీ దవాఖానలో 8 నెలలుగా డాక్టర్ లేకపోవడం దారుణమన్నారు. ఇది ప్రజల ఆరోగ్యం పట్ల ఆరోగ్య శాఖ అధికారుల నిర్లక్ష్యానికి, చిన్నచూపునకు నిదర్శనమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఇక్కడ వైద్యుడిని నియమించకపోతే స్థానిక ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. సమస్య తీవ్రతపై మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాస్‌తో ఫోన్ ద్వారా మాట్లాడారు. దీనిపై డిఎమ్ హెచ్ ఓ సానుకూలంగా స్పందిస్తూ మరో 10 రోజుల్లో అరుంధతి నగర్ బస్తీ దవాఖానకు వైద్యుడిని నియమిస్తామని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్ బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

## అల్వాల్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయండి

**-మంత్రి పొంగులేటికి ఎమ్మెల్యే మర్రి వినతి**


మంత్రికి వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

**అల్వాల్, జూలై 10 ప్రభాతవార్త:** అల్వాల్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వినతి పత్రం అందించారు. సచివాలయంలో ఎమ్మెల్యే మంత్రిని కలిసిన సమస్యను తెలపడం జరిగింది. అల్వాల్ ప్రజలు రిజిస్ట్రేష న్‌లు ఇతర అవసరాలు కోసం పది కిలోమీటర్లు దూరం లోని బేగంపేట్‌కు వెళ్ళాల్సి వస్తోందని వివరించారు. కార్యాలయంలో 90 శాతం అల్వాల్‌కు చెందిన రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయని తెలిపారు. బస్సు సౌఖర్యం కూడా సరిగా లేని ప్రదేశంలో కార్యాలయం ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తెచ్చారు. స్థానికంగా గ్రామ కంఠానికి చెందిన భూములు ఉన్న నేపధ్యంలో రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

## రాము సాహిత్యం సమాజంలో సుస్థిరం: జస్టిస్ భవానీ ప్రసాద్


వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డును ప్రధానం చేస్తున్న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ భవానీ ప్రసాద్, ఎల్లూరి శివారెడ్డి, డాక్టర్ విడి రాజగోపాల్ తదితరులు

**చిక్కడపల్లి జులై 10 ( ప్రభాతవార్త) :** ప్రముఖ కవి డాక్టర్ యం.కె. రాము రచించిన లలిత గీతాలు తెలుగు భాషను సుసంపన్నం చేశాయని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ భవానీ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై శిఖరం ఆర్ట్స్ థియేటర్స్, సృజన భారతి, కల్పన కళా నికేతన్, తెలంగాణ కళా జాగృతి ఫౌండేషన్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త నిర్వహణలో లలిత సంగీతానికి పట్టాభిషేకం పేరిట ప్రత్యేక సభ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ యం.కె. రాము రచించిన 216 లలిత గీతాల గ్రంథాన్ని ఆవిష్కరించి, ఆయనకు ఖీవండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ఖీ అవార్డును ముఖ్య అతిథిగా జస్టిస్ భవానీ ప్రసాద్ హాజరై ఆదాయపు పన్నుల శాఖ విశ్రాంత సంచాలకుడు నరసింహప్ప, భూగర్భ గనుల శాఖ పూర్వ డైరెక్టర్ రాజగోపాల్‌లతో కలిసి రాము దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి బింగి నరేంద్ర ప్రకటించిన అవార్డును రాముకు బహుకరించారు. జస్టిస్ భవానీ ప్రసాద్ మాట్లాడుతూ రాము గారి పాట ఎంత ఉన్నతమైనదో, ఆయన వ్యక్తిత్వం కూడా అంతటి ఉన్నతమైనది. ఆయన సృష్టించిన సాహిత్యం సమాజంలో ఎప్పటికీ సుస్థిరంగా నిలిచిపోతుందని ప్రశంసించారు. అధ్యక్షత వహించిన తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ రాము తన రసమయి సంస్థ ద్వారా ఎందరో కళాకారులను, సాహితీవేత్తలను ప్రోత్సహించి శాశ్వత కీర్తిని సంపాదించుకున్నారని కొనియాడారు. రాజగోపాల్ మాట్లాడుతూ సాంస్కృతిక సంస్థల నిర్వహణలో రాము భీష్ముడు వంటివారని అభివర్ణించారు. సత్కారం అనంతరం డాక్టర్ యం.కె. రాము స్పందిస్తూ.. తాను పేరు కోసమో, అవార్డుల కోసమో రాయలేదని, సమాజానికి తన వంతుగా సాహితీ ప్రక్రియను అందించాలనే తపనతోనే ఈ రచనలు చేశానని తెలిపారు. ప్రముఖ కవి డాక్టర్ సి. నారాయణరెడ్డి, ప్రముఖ సంగీత దర్శకులు సాలూరి రాజేశ్వరరావు, మహానటుడు ఎన్టీఆర్ తనకు గురుతుల్యులని ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. ఈ వేదికపై సాధన నరసింహాచార్య, రఘుశ్రీ, డాక్టర్ నల్లేశ్వరం శంకరం తదిత రులు పాల్గొని ప్రసంగించారు. ఆశాలత వ్యాఖ్యానంలో సాగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ లలితా సింధూరి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## ట్రాఫిక్ పోలీసుల తనిఖీలో పట్టుబడిన అనుమానస్పద ద్విచక్రవాహనం


స్పెషల్ డ్రైవ్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

**గోషామహల్ ,జూలై 10 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదాలను నివారించడానికి, వాహనదారుల భద్రతను కాపాడేందుకు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వాహనాలను తనిఖీలు చేస్తున్నట్లు గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బైరి రాజు తెలిపారు. శుక్రవారం గోషామహల్ ట్రాఫిక్ పోలీసులు అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో డ్రంకన్ డ్రైవ్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర ట్రాఫిక్ అదనపు పోలీస్ కమీషనర్ జోయల్ డేవిడ్‌ఆదేశాల మేరకు ట్రాఫిక్ డి.సి.పి కాజల్ పర్యవేక్షణలో గోషామహల్ ట్రాఫిక్ ఎ.సి.పి ధనలక్ష్మి ఆధ్వర్యంలో గోషామహల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తరుచుగా డ్రంకన్ డ్రైవ్ చేయడం జరుగుతుందన్నారు. మహబూబ్ నగర్ అచ్చంపేట ప్రాంతానికి చెందిన షేక్‌రసూల్ (26)బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి అమీర్‌పేట ప్రాంతంలో నివాసం ఉంటూ మియాపూర్ ప్రాంతంలో ఆటోమోటిక్ కియా షోరూమ్‌లో మెకానిక్ కొనసాగుతున్నాడు. శుక్రవారంగోషామహల్ పోలీసులు అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో తనిఖీలు చేస్తుండగా అనుమానం వచ్చి ద్విచక్రవాహనంపై వస్తున్న షేక్‌రసూల్ ఆపి వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్లు చూపించాలని సిఐ బైరి రాజుకోరారు. అందుకు తన వద్ద వాహనానికి సంబంధించిన పత్రాలు లేవని సమాధానం చెప్పాడు. కొద్ది నెలలక్రితం పేస్‌బుక్ ద్వారా ఒక వ్యక్తి నుంచి తాను ద్విచక్రవాహాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పాడంతో వెంటనే ట్రాఫిక్ పోలీసులు అఫ్జల్‌గంజ్ లా అండ్ ఆర్డర్ పోలీసులకు ద్విచక్రవాహాన్ని అప్పగించినట్లు చెప్పారు. ఎవరైనా వాహనాలను కొనుగోలు చేయాల్సి న సమయంలో పత్రాలను పరిశీలించిన తర్వాతనే వాహానాలను కొనుగోలు చేయాలని గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బైరి రాజు తెలిపారు. ఉదయం వేళ్ల విద్యార్థులను ఆటో రిక్షాలో పాఠశాలలకు తీసుకు వెళ్లే ఆటోరిక్షా డ్రైవర్లను, ద్విచక్రవాహనాలను తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. తనిఖీలో భాగంగా చాక్నవాడి ప్రాంతానికి చెందిన చగన్ దేవాసి(32)మధ్య సేవించి ద్విచక్రవాహనాన్నినడుపుతూ పట్టుబడ్డాడు. బ్రీత్‌ఆనలైజర్‌లో పరీక్షలో అతని రక్తంలో మధ్యశాతం58శాతం ఉండటంతోఅతనిపై మోటార్ వాహనాల చట్టంలోని సంబంధిత నిబంధనలను ప్రకారం కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలో ట్రాఫిక్ ఎస్ఐ జగదీష్, ట్రాఫిక్ పోలీసుల ఉన్నారు.

## నిమ్స్‌లో శస్త్రచికిత్స కోసం వచ్చిన రైతు అదృశ్యం

**జూబ్లీహిల్స్, జూలై 10, ప్రభాతవార్త:**
నిమ్స్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స కోసం వచ్చిన ఒక రైతు అదృశ్యమైన సంఘటన పంజాగుట్ట ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన బి. మత్స్యగిరి(41) అనే రైతుకు నాలుగేళ్ల క్రితం తలకు గాయమవ్వగా ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఇటీవల మళ్లీ అనారోగ్య సమస్య రావడంతో నెల క్రితం బీబీనగర్ ఎయిమ్స్‌లో వైద్యులను సంప్రదించారు. తలలో ఉన్న ద్రవాన్ని శస్త్రచికిత్స ద్వారా తొలగించాలని, పంజాగుట్ట నిమ్స్‌కు వెళ్లాలని వైద్యులు సూచించారు. ఈ నేపథ్యంలోనే ఆసుపత్రికి తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన అతను బెడ్ దొరకకపోవడంతో బుధవారం రాత్రి నిమ్స్ ప్రాంగణంలోనే నిద్రించారు. మరుసటి రోజు ఉదయం4 గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులు నిద్రలేచి చూడగా అతని ఆచూకీ కనిపించలేదు. ఎక్కడ వెదికినా అతని జాడ లభించలేదు. దీంతో అతని తల్లి లక్ష్మి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నారు.

## దృష్టి మళ్లించి చైన్ స్నాచింగ్‌లు

**-నిందితుడు అరెస్టు,బంగారు గొలుసులు స్వాధీనం**




**అత్తాపూర్ జూలై10 ,ప్రభాతవార్త :**
ప్రయాణికుల దృష్టి మళ్లించి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నిందితుడిని అత్తాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకొని బంగారు గోలుసులను స్వాధీనం చేసుకున్నారు. సీఐ నాగేశ్వర్ రావు వివరాల ప్రకారం...అత్తాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆరంఘర్ బస్‌స్టాండ్ వద్ద 16-10-2025న గాజుల సతీష్ కుమార్ బస్సు నుంచి దిగుతున్న సమయంలో నిందితులు ఎ.హతకడే విశాలు(25)రవి, జహంగీర్, శ్యామ్ సుందర్‌లు పథకం ప్రకారం అతని చుట్టుముట్టి ఇద్దరు నిందితులు అడ్డుకోగా, మరో ఇద్దరు నిందితులు తోసివేసి దృష్టి మళ్లించారు. ఆ సమయంలో ఎ1 చాకచక్యంగా మెడలో ఉన్న సుమారు 1.25 తులాల బంగారం గోలుసును అపహరించి పరారయ్యారు. బాధితుడు పోలీసులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన అత్తాపూర్ పోలీసులు దర్యాప్తు చేయగా అమాయకులను లక్ష్యంగా చేసుకుని దృష్టి మళ్లించి బంగారు గోలుసులు దొంగలించే ముఠాగా ఏర్పడి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్లు గురించారు. నిందితుడు హతకడే విశాల్ ను అరెస్టు చేసి నాలుగు కేసుల్లో 9.5 ,5.0,4.8,10.4 గ్రాముల బంగారు గోలుసులను స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## మధురానగర్ ఠాణా వద్ద పాము పిల్లల కలకలం



**జూబ్లీహిల్స్, జూలై 10, ప్రభాతవార్త:**
మధురానగర్ ఠాణా ప్రాంగణంలో పాము పిల్లల కలకలం చోటుచేసుకుంది. ఫిర్యాదుదారులు కూర్చొనే ప్రాంతానికి సమీపంలో మూడు నాగు పాము పిల్లలు కనిపించడంతో ఫిర్యాదుదారులు భయాందోళనలకు గురయ్యారు. దీంతో ఫిర్యాదుదారులు కంగారుపడి అక్కడే ఉన్న పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పోలీసులు స్నేక్ సొసైటీ సభ్యులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరకొని పాము పిల్లలను మూడింటిని స్వాధీనం చేసుకొన్నారు. ఫిర్యాదుదారులు కూర్చొనే ప్రాంతం వైపు పట్టుబడిన వాహానాలను నిలుపుతుంటారు. అటువైపు ఖాళీ స్థలం ఎక్కువగా ఉంటుంది. ఆ ప్రాంతంలోనే నాగుపాము పిల్లలు పెట్టి ఉంటుందని స్థానికులు అనుమానిస్తున్నారు. అధికారులు వెంటనే ఈ ప్రాంతాన్ని పరిశీలించి పొదలను తొలగించాల్సి న అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా పట్టుబడిన పాము పిల్లలను స్నేక్ సొసైటీ సభ్యులు అటవీ ప్రాంతంలో వదలడానికి తీసుకెళ్లారు.

## చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

**ముషీరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ముషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 8వ తేదీ గాంధీనగర్ హెబ్రోన్ చర్చి వద్ద రోడ్డుపై ఒక గుర్తు తెలియని వ్యక్తి (55) స్పృహ కోల్పోయి పడిపోయి ఉండటం గమనించిన ముషీరాబాద్ పెట్రోలింగ్ సిబ్బంది, ఆ వ్యక్తిని గాంధీ హాస్పటల్‌లో చికిత్స నిమిత్తం తరలించారు. గాంధీ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న ఆ వ్యక్తి గురువారం మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. ఆ వ్యక్తికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

### ఆన్‌లైన్ గోల్డ్ ట్రేడింగ్ పేరుతో మోసపోయిన దంపతులు

**యూసుఫ్‌గూడ, 10 జులై, ప్రభాతవార్త :**
ఆన్‌లైన్ పెట్టు పెడితే భారీ లాభం మంటూ దంపుతలకు కుచ్చుటోపి పెట్టిన వ్యవహారం మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలలోకి వేళ్తే యూసుఫ్‌గూడకు చెందిన శ్రీలత, చంద్రశేఖర్ దంపతులకు బాలకృష్ణ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. గోల్డ్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని నిమ్మించాడు. బాలకృష్ణ మాటలు నమ్మిన శ్రీలత ఆయన చెప్పిన కొసమట్టం ఫైనాన్ సంస్థలో గోల్డ్ లోన్ తీసుకుని 30 తులాల బంగారు ఆభరణాలను తనఖా పెట్టి సుమారు రూ.18 లక్షల లోన్ తీసుకుంది. ఈ డబ్బు పెట్టుబడి పేరుతో బాలకృష్ణకు శ్రీలత అకౌంట్‌కు బదిలీ చేసింది. బాలకృష్ణ పెట్టుబడి పేరుతో డబ్బులు తీసుకోవడంతో పాటు తమకు సంబంధం లేకుండానే తమ పేరుతో ఉన్న బంగారు ఆభరణాలను కూడా బాలకృష్ణ కాజేశాడు. ఈ విషయమై కొసమట్టం ఫైనాన్స్ మేనేజర్‌తో కుమ్మక్కై తమను బాలకృష్ణ మోసం చేశాడని మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలకృష్ణ అతని కుమారుడు నిఖిల్‌తో పాటు మేనేజర్ సంధ్యారాణిని అరెస్టు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### జూబ్లీహిల్స్‌లో సినీనటుడి ఇంటి మీదకు దూసుకెళ్లిన కారు

**జూబ్లీహిల్స్, జూలై 10, ప్రభాతవార్త:**
జూబ్లీహిల్స్‌లో అర్ధరాత్రి సినీనటుడి ఇంటి మీదకు ఒక కారు దూసుకెళ్లింది. ఈ సంఘటనలో సినీనటుడి ఇంటి ప్రహరి ధ్వంసమైంది. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 10సిలో నివసించే సినీనటుడు ధర్మ మహేష్ నివాసంలోకి గురువారం రాత్రి 12.30 గంటల ప్రాంతంలో ఒక కారు వేగంగా వచ్చి అదుపుతప్పి దూసుకొచ్చింది. దీంతో ధర్మ ఇంటి ముందు ఉన్న ప్రహరీని బలంగా ఢీకొట్టడంతో గోడ మొత్తం ధ్వంసమైంది. పెద్దఎత్తున శబ్ధం రావడంతో ధర్మ అతని కుటుంబ సభ్యులు గమనించగా కారు ఢీకొట్టి కనిపించింది. దీంతో వారు జూబ్లీహిల్స్ పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. యూపీ 64ఏయూ 7070 నంబరు గల వాహనాన్ని కార్తిక్ కుమార్(47) అనే వ్యక్తి నడుపుతున్నట్లు గుర్తించారు. అతనికి గాయలవ్వడంతో తక్షణమే ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. కారులో ఒక్కరే ఉన్నారా..? లేక మరవరైనా ఉన్నారా అనే కోణంలో విచారిస్తున్నారు.

## షెడ్డుపై నుండి పడి కార్మికుడికి తీవ్రగాయాలు

**దుండిగల్, జూలై 10, ప్రభాతవార్త :** కమర్షియల్ షెడ్డుపై పనిచేస్తూ కింద పడి ఓ వ్యక్తి తలకు బలమైన గాయాలు కాగా ప్రైవేట్ ఆసుపత్రిలో చికిచ్చ పొందుతున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న దుండిగల్ పోలీస్‌లు దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా, ఇచ్చాపురం మండలం రక్తకన్న గ్రామానికి చెందిన లంకా భాస్కర్ రావు (43) సూరారం ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటు కార్పెంటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం పని నిమిత్తం చర్చి గాగిల్లపూర్ వెళ్లిన అతను నూతనంగా నిర్మిస్తున్న షెడ్డులో ఫాబ్రికేషన్ పనుచేస్తుండగా కిందపడి తలకు, శరీర భాగాలకు బలమైన గాయాలు కాగా అతనితో కలిసి పనిచేస్తున్న కార్మికులు చికిచ్చ నిమిత్తం సూరారం మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించగా అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. మెరుగైన చికిచ్చ నిమిత్తం చింతల్‌లోని ప్రాణధార ఆసుపత్రికి తరలించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. భార్య లంకా ఎల్లమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు సిఐ పి.సతీష్ తెలిపారు.

## అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలు ఇవ్వాలి




వార్డు కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ మహిళా నేత లిఖిత అమర్‌నాథ్‌గౌడ్

హైదరాబాద్, జులై 10, (ప్రభాతవార్త): అర్హులైన ప్రతి మహిళకు ఎటువంటి జాప్యం లేకుండా ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయాలని బీఆర్ఎస్ నల్లకుంట డివిజన్ సీనియర్ మహిళా నేత లిఖిత అమర్‌నాథ్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆమె శుక్రవారం నల్లకుంటలోని 81వ వార్డు కార్యాలయాన్ని సందర్శించి, అక్కడ అధికారులతో చర్చించి, నల్లకుంట మహిళలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా లిఖిత మాట్లాడుతూ అనేక మంది మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన ఇందిరమ్మ చీరలు అందలేదని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, పరిపాలనా వైఫల్యాల కారణంగా నల్లకుంట డివిజన్ మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయటంలో నిర్లక్ష్యం వదిలి, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

## ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలి



మక్కా ఉమ్రాలో ప్రార్ధనలు చేస్తున్న ముజీబ్‌హుస్సేనీ

గన్‌ఫౌండ్రి, జులై 10 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనించాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ,శాంతి యుతమైన జీవనాన్ని గడపాలని ఆకాంక్షించినట్లు తెలంగాణనాన్ గజిటెడ్ కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. ముజీబ్ హుస్సేనీ అన్నారు. తనకుటుంబ సభ్యులతో కలసి పవిత్ర పుణ్య క్షేత్రమైన మక్కా ఉమ్రా తీర్ధయాత్రలో డాక్టర్ ఎస్.ఎం. ముజీ బ్‌హుస్సేనీ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికి అండగా ఉంటూ, వారి సమస్యల పరి ష్కారానికి, వారి సంక్షేమ కోసం తాను మరింత కృషి చేస్తానన్నారు. పవిత్ర యాత్రతన జీవితంలో ఒక మరపురాని మధుర జ్ఞాపకమని, ఇక్కడి ప్రశాంతమైన వాతావరణం, తనకు సరి కొత్త ఉత్సాహాన్ని సేవా దృక్పథాన్ని ఇచ్చిందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధిలో తన వంతు పాత్రను మరింత సమర్ధవతంగా పోషిస్తానన్నారు.

## ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే



ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణలత తదితరులు

కంటోన్మెంట్, జులై 10 ప్రభాతవార్త : సికింద్రాబాద్ మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ మహిళా కళాశాలలో హాస్టల్ వసతి, అధ్యాపకుల కొరత, పాలిటెక్నిక్‌లో నెలకొన్న మౌళిక సదుపాయాలు మెరుగు పర్చాలని కోరుతూ కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణ లత శుక్రవారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శ్రీగణేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 1050 విద్యార్థులు చదువుతుండగా కేవలం 120 మంది విద్యార్థులకు సరిపడే హాస్టల్ వసతి ఉందని ఆయన దృష్టికి తెచ్చారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినీలకు హాస్టల్ సదుపాయాలు లేక, ప్రైవేట్ ఖర్చులు భరించలేక సీట్లను వదులు కొని పోతున్నారని అయన దృష్టికి తెచ్చారు. కాలేజీ, హాస్టల్‌కు సొంత కిచెన్, డైనింగ్ హాల్ లేవన్నారు. అదే విధంగా వివిధ కోర్సులలో అధ్యాపకులు (లెక్చరర్ల) కొరత ఉందన్నారు. అందుకు ఆయన స్పందిస్తూ ప్రభుత్వ పాలి టెక్నిక్ కళాశాల, హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కా రానికి సకాలంలో నిధులు విడుదలైయ్యే విధంగా సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తెచ్చి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల హెచ్ఓడీలు నవీన్, విష్ణుప్రియలు పాల్గొన్నారు.

## ఘనంగా వెంకటేశ్వరుడికి సుదర్శ హోమం



వివేకానంద్‌నగర్‌లో భూనీల సమేత వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవం ముగింపు సందర్భంగా సుదర్శన హోమం చేస్తున్న భక్తులు

యూసుఫ్‌గూడ, 10 జులై, ప్రభాతవార్త : గాయిత్రినగర్ డివిజన్ పరిధిలోని శ్రీ వివేకానంద్‌నగర్ కాలనీ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన ప్రాంగణంలో శ్రీ భూనీల సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి 14వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకల ముగింపు సందర్భంగా శుక్రవారం ఘనంగా సుదర్శన హోమం నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి నిత్యారాధన సేవా కాలం, ద్వజకుంభరాధనలు, మహాపూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నాదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పులిగోళ్ల శ్రీనివాస్ యాదవ్, కాయితి యాదవరెడ్డి, జీవీ ప్రసాద్, సిలికి శ్రీనివాస్, కల్వల ఏడుకొండలు, కొంద్రు మురళి, ముచ్చర్ల శ్రీనివాస్, చిలకల కృష్ణారెడ్డి, బొంత హరికృష్ణ, బి.వెంకన్న, సైదయ్య, భరత్‌తో పాటు కాలనీ వాసులు, పెద్ద సంఖ్యలో భక్తులుపాల్గొన్నారు.

## విద్యుత్ లేని ప్రాంతాలు...

బేగంబజార్, జులై 10 ప్రభాతవార్త: బేగంబజార్ సిబిడి పరిధిలో విద్యుత్ మరమ్మత్తుల కారణంగా శనివారం 11 కెవి విద్యుత్ ఫీడర్లలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు బేగంబజార్ డివిజనల్‌ఇంజనీర్ అన్నయ్య తెలిపారు. 11 కె.వి.బేగంబజార్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా ఉదయం 9గంటల 30నిమిషాల నుంచి మధ్యాహ్నం 12గంటల 30 నిమిషాల వరకు అఫ్జల్‌గంజ్ బస్‌స్టాండ్, చుడీబజార్, సిటి మీటర్, దీపా నర్సింగ్ హోమ్, దీపక్ హోటల్, గాంధీగల్లీ, గ్రేవియార్డు, జుమ్మురాత్‌బజార్, జోషివాడి, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. 11 కెవి కార్వాన్, కెడి కాలనీ విద్యుత్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా మధ్యాహ్నం 2గంటల 30 నిమిషాల నుంచి సాయంత్రం 5గంటల 30 నిమిషాల వరకు మొగల్‌కానాళా, మొగల్‌నగర్, కె.డి కాలనీ, మొగల్‌నగర్, న్యూమొగల్ నగర్, రామ్‌దాస్‌నగర్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు బేగం బజార్ డివిజనల్ ఇంజనీర్ అన్నయ్య తెలిపారు.

## ప్రధాన రహదారి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తా : బండి రమేష్



గోపాల్ నగర్ కాలనీ వాసులతో మాట్లాడుతున్న బండి రమేష్

కెపిహెచ్‌బి కాలనీ, జులై 10, ప్రభాతవార్త గోపాల్‌నగర్ ప్రధాన రహదారి సమస్యను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్ హామీ ఇచ్చారు. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని గోపాల్‌నగర్ మెయిన్ రోడ్ ప్లాట్ యజమానుల విజ్ఞప్తి మేరకు బండి రమేష్ గోపాల్‌నగర్ ప్రధాన రహదారిని బండి రమేష్ సందర్శించి అక్కడి ప్లాట్ యజమానులతో సమావేశమై వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్లాట్ యజమానులు మాట్లాడుతూ గోపాల్‌నగర్ లేఅవుట్ 1980లో ఏర్పడిందని, 1981లో ప్లాట్లను కొనుగోలు చేశామని తెలిపారు. అప్పట్లో ఆమోదించబడిన లేఅవుట్‌లో ప్రధాన రహదారి వెడల్పు 40 అడుగులుగా మాత్రమే ఉందని, తమ వద్ద ఉన్న అన్ని రిజిస్టర్డ్ అమ్మకపు పత్రాల్లో కూడా 40 అడుగుల రహదారే నమోదై ఉందని వివరించారు. మూసాపేట నుండి లింగంపల్లి వరకు ఇదే రహదారి అనేక ప్రాంతాల్లో 60 నుండి 80 అడుగుల వెడల్పుతో మాత్రమే ఉందని అలాంటప్పుడు గోపాల్‌నగర్ ప్రాంతంలో మాత్రమే 120 అడుగుల రహదారి పేరుతో భూములను సేకరించడం పూర్తిగా అన్యాయమని తెలిపారు. ఈ సమస్య గత 40 సంవత్సరాలుగా పరిష్కారం కాకుండా కొనసాగుతోందని, చట్టబద్ధంగా కొనుగోలు చేసిన ప్లాట్ యజమానుల హక్కులను ప్రభుత్వం పరిరక్షించాలని వారు బండి రమేష్‌ని కోరారు. ప్లాట్ యజమానుల వినతిని సంబంధిత పత్రాలను పరిశీలించిన అనంతరం బండి రమేష్ సమస్య తీవ్రతను గుర్తించి. సంబంధిత అధికారులతో చర్చించి ఈ సమస్యకు వీలైనంత త్వరగా న్యాయమైన పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ బాబు, వినోద్ చావా, శ్రీనివాస్, తిలక్, అనిల్, సుధాకర్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్‌లో నూతన డిసిసి సభ్యులు, డివిజన్ అధ్యక్షులకు నియామక పత్రాలు



నియామక పత్రాలు అందజేస్తున్న దృశ్యం

నిజాంపేట్, జులై 10, ప్రభాతవార్త పార్టీ అధిష్ఠానం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, గ్రామాలు, బస్తీలు, డివిజన్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు అంకితభావంతో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి నూతనంగా నియమితులైన డీసీసీ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులకు మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి పాల్గొని నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే దిశగా కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, సంస్థాగత కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి డివిజన్‌లో బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయాలని కోరారు. యువత, మహిళలు, సామాజిక వర్గాలన్నింటినీ కాంగ్రెస్ పార్టీతో అనుసంధానం చేస్తూ ప్రజల్లో పార్టీపై విశ్వాసాన్ని మరింత పెంచాలని తెలిపారు. మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులు పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేయాలని, కార్యకర్తలతో సమన్వయం పెంచుకుని కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ బలోపేతమే ప్రతి నాయకుడి ప్రధాన లక్ష్యంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ మహిళా అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు అంజలి యాదవ్, పార్టీ నాయకులు, డీసీసీ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### 13న జెబిఎస్‌లో పార్శిల్ వస్తువులపై వేలం

కంటోన్మెంట్, జులై 10 ప్రభాతవార్త : సికింద్రాబాద్ జూబ్లీ బస్‌స్టేషన్‌లో కొనసాగుతున్న ఆర్టీసీ కార్గో పార్శిల్‌కు వచ్చిన వస్తువులను గత జనవరి 1వ తేదీ నుంచి 31 మే వరకు తమ వస్తువులు తీసుకెళ్లకపోవడంతో వాటిపై ఈ నెల 13వ తేదీన మధ్యాహ్నం 1 గంటల నుంచి 5 గంటల వరకు ఫ్లాట్ ఫారం నెం 14వద్ద వేలం వేయబడుతుందని కంటోన్మెంట్ డిపో మేనేజర్ కవిత తెలిపారు. ఆటో మొబైల్స్, బయోమెడికల్, క్లాత్, ఎలక్ట్రికల్, ఎక్ట్రానిక్స్ వంటి వస్తువు ధరపై 50 శాతం వేలం వేయబడుతుందని తెలిపారు.

## స్పందనకు వందనం... వెలిగిన హైమాస్ట్ దీపం

చాంద్రాయణగుట్ట, జులై 10, ప్రభాతవార్త : చాంద్రాయణగుట్ట కేశవగిరి (చాంద్రాయణగుట్ట పోలీసుస్టేషన్) చౌరస్తాలో గత కొన్ని రోజులుగా మరమ్మతులకు నోచుకోక అలంకార ప్రాయంగా మారిన హైమాస్ట్ దీపాలు ఎట్టకేలకు వెలుగులీనాయి. వెలగని హైమాస్ట్ దీపాలతో స్థానిక ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో 'వెలగని వీధి దీపం...ఎవరిదీ ఈ భారం' అన్న శీర్షికన ఈనెల 6న ప్రచురితమైన 'వార్త' కథనానికి జీహెచ్ఎంసి రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి, జోన్ ఎలక్ట్రికల్ డిఇ సత్యనారాయణరెడ్డిలు స్పందించి తగిన చర్యలు తీసుకున్నారు. హైమాస్ట్ దీపాల మరమ్మతులకు అవసరమైన మొబైల్ ల్యాడర్‌ను సమకూర్చారు. ఎలక్ట్రికల్ సిబ్బంది శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. పాడైన వైరింగ్‌ను తొలగించారు. వెలగని దీపాలను బాగు చేశారు. హైమాస్ట్ దీపాలు తిరిగి పనిచేసేలా చర్యలు తీసుకున్న జెడ్సీ, డిఇలకు స్థానిక ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారు.




శుక్రవారం హరిబౌలిలోని రిఫా-యే-ఆమ్ ఉన్నత పాఠశాలలో కొత్తగా నిర్మించిన భవనాన్ని ప్రారంభించి ప్రసంగిస్తున్న ఆర్‌జెడి ఎం.సోమిరెడ్డి. చిత్రంలో జిల్లా డిఈఓ ఎస్.యాదయ్య, బహదూర్‌పురా డిప్యూటీ ఈవో ఆర్.సుమన్, డిప్యూటీ ఐఓఎస్ ఎస్.నరేందర్ యాదవ్, మాజీ ఆర్జేడి లక్ష్మారెడ్డి, పాఠశాల యాజమాన్యం.
- చాంద్రాయణగుట్ట, జులై 10, ప్రభాతవార్త

## వడ్డేపల్లి నర్సింగ్ రావు ఆశయసాధనే నిజమైన నివాళి : రాజేశ్వరరావు



వడ్డేపల్లి నర్సింగ్ రావుకు నివాళులు అర్పిస్తున్న రాజేశ్వరరావు

కెపిహెచ్‌బి కాలనీ, జులై 10, ప్రభాతవార్త ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ భూ ఖనిజాభివృద్ధి శాఖ మాజీ చైర్మన్ దివంగత నేత స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగ్ రావు జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కూకట్‌పల్లిలో, వివేకానంద నగర్ కాలనీలో గల వడ్డేపల్లి నర్సింగరావు విగ్రహాల వద్ద బిజెపి సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని వడ్డేపల్లి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగ్ రావు ప్రజాసేవను జీవిత ధ్యేయంగా భావించి నిరంతరం ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించిన మహోన్నత నాయకుడని కొనియాడారు. పదవిని ప్రజాసేవకు సాధనంగా ఉపయోగించుకొని, నిరాడంబర జీవనం, నిబద్ధత, నిజాయితీతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఆయన ఆశయ సాధనే వారికి మనం అర్పించే నిజమైన నివాళి సమాజాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఆయన చూపిన బాటలో నడుస్తూ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని రాజేశ్వరరావు అన్నారు.

### జనసేన పార్టీ ఆధ్వర్యంలో సర్ కార్యక్రమం...

కెపిహెచ్‌బి కాలనీ, జులై 10, ప్రభాతవార్త కూకట్‌పల్లి జనసేన పార్టీ కంటెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ సూచనల మేరకు దేశ వ్యాప్తంగా జరుగుతున్న సర్ ప్రక్రియలో భాగంగా శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కెపిహెచ్‌బి కాలనీ 3వ ఫేస్‌లో జనసేన పార్టీ నాయకులు బిఎల్ఓలతో కలిసి ఓటర్లతో వారియొక్క ఎన్నికల గణన ఫారం ఫిల్లింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, వినోద్ హెన్రీ తదితరులు పాల్గొన్నారు.

## 16న గుట్టలో జగన్నాథుని భవ్య రథయాత్ర



ఆలయంలో కొలువైన సుభద్రదేవి సమేత బలభద్రుడు జగన్నాథుడు

చాంద్రాయణగుట్ట, జులై 10, ప్రభాతవార్త : పాతబస్తీ చాంద్రాయణ గుట్ట శ్రీ జగన్నాథ స్వామి మఠ్ (మందిర్) లో ఈనెల 16వ తేదీ గురువారం శ్రీ జగన్నాథస్వామి భవ్య, దివ్య రథయాత్రను నిర్వహించనున్నట్లు కాశీ పీఠాధిపతి జగద్గురు రామానుజాచార్య స్వామి శ్రీ రుగ్వేదాచార్య జీ తెలిపారు. సాయంత్రం 4గంటలకు యజ్ఞం, 4.30 గంటలకు హారతి, 5 గంటలకు అందంగా తీర్చిదిద్దిన రథంపై సోదరి సుభద్రదేవి, సోదరుడు బలభద్రుడితో కలిసి శ్రీ జగన్నాథస్వామి కొలువై పురవీధుల్లో ఊరేగుతారన్నారు. ముగ్గురు దివ్యమూర్తుల దర్శనం చేసి, ప్రసాదాన్ని స్వీకరించిన వారు ఇహ పరలోకాలలోను వీడి నేరుగా స్వర్గానికి వెళతారని, వారికి పునః జన్మ ఉండదని వివరించారు. అనంతరం భక్తులకు మహాప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. భగవద్బంధువులు రథయాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొని ఆ జగన్నాథుని ఆనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు. కాగా గత నెల 29న జరిగిన దేవస్నానం (స్నాన యాత్ర) తరువాత జగన్నాథుడు జ్వరంతో బాధ పడుతూ 15 రోజుల పాటు భక్తులకు దర్శనం ఇవ్వకుండా విరామ గదిలో ఉంటారు. ఆ సమయంలో శ్రీ జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రదేవికి ప్రత్యేక ఔషదాలతో లేపనాలు చేస్తారు. విశ్రాంతి, అనవసర కాలం ముగిసిన తరువాత స్వామివారు నవ యవ్వన రూపంలో భక్తులకు దర్శనమిస్తారు. ఆ మరుసటి దినం జగన్నాథ స్వామి భక్తులకు దర్శనం ఇవ్వటానికి రథంపై వీధుల్లో విహరిస్తారు. దీనినే జగన్నాథ రథయాత్రగా పిలుస్తారు.

# 24 లోగా ఎన్యుమరేషన్ ఫారాలను తిరిగి ఇవ్వాలి

-రాజేంద్రనగర్ ఈఆర్ఓ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

అత్తాపూర్ జులై10 ,ప్రభాతవార్త : రాజేంద్రనగర్ నియోజకవర్గం ఓటర్లందరు ఈ నెల 24వ తేదీ లోగా బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ ఓ) లు ఇచ్చిన ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి తిరిగి బీఎల్ ఓ లకు పాస్ పోర్ట్ సైజు ఫోటో పెట్టి ఇవ్వాలని, అలా ఇచ్చిన వారి పేర్లు మాత్రమే జులై 31న విడుదల చేసే ఓటరు జాబితా డ్రాఫ్ట్ లో ఉంటాయని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్ఓ) సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, శుక్రవారం భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) నిర్వహించిన సమీక్షా సమావేశంలో అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా ఎన్యుమరేషన్ ఫారాలను (ఈఎఫ్) డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించడం జరిగిందన్నారు. జులై 24 లోగా ఓటర్ల నుంచి వచ్చిన ఎన్యుమరేషన్ ఫారాలన్నింటిని అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఎన్యుమరేషన్ ఫారాలను తీసుకుని మెల్లిగా పూర్తి చేసి ఇస్తామంటే ఓటరు పేరు త్వరలో వచ్చే డ్రాఫ్ట్ లో ఉండదన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఒక ఈఆర్ఓ, ఏడుగురు ఏఈఆర్ లు, 55 మంది వరకు సూపర్వైజర్లు, 547 మంది బీఎల్ఓ లు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి తిరిగి తీసుకునే పనిలో ఉన్నారన్నారు. రాజకీయ పార్టీల నుంచి నియమితులైన బీఎల్ఏ లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, య వజన సంఘాలు ఓటర్లను చైతన్యం చేసి సకాలంలో ఎన్యుమరేషన్ ఫారాలను అందజేసే విదంగా చూడాలన్నారు. ఇప్పుడు ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి ఇవ్వకపోతే ఆగస్టు లో అన్ని ధృవీకరణ పత్రాలు పెట్టి ఫారం 6 సమర్పించాల్సి ఉంటుందని, అలా చేసిన వారి పేరు అక్టోబరు లో వచ్చే తుది ఓటరు జాబితా లో పొందుపరచడం జరుగుతుందన్నారు. అలా కాకుండ ఈ నెల 24లోగా ఎన్యుమరేషన్ ఫారాలను అందజేస్తే బాగుంటుందని తెలిపారు. ఇతర సమాచారం కోసం. క్రింద ఇచ్చిన ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

**ఏఈఆర్ ఓల పేర్లు, ఫోన్ నెంబర్లు :** ఎన్ శ్రీనివాస్ రెడ్డి, ఏఈఆర్ఓ (గండిపేట్ తహసీల్దార్) 7995086358జి లక్ష్మారెడ్డి, ఏఈఆర్ఓ ( డిప్యూటీ కమిషనర్, నార్సింగి) 9121529597బి సురేందర్ రెడ్డి, ఏఈఆర్ ఓ ( డిప్యూటీ కమిషనర్, రాజేంద్రనగర్) 8712499 189బొమ్మ రాములు, ఏఈఆర్ఓ ( తహసీల్దార్, రాజేంద్రనగర్) 9849904231మల్లయ్య, ఏఈఆర్ఓ ( డిప్యూటీ కమిషనర్, అత్తాపూర్) 6309529286సుమన్ రావు, ఏఈఆర్ఓ ( డిప్యూటీ కమిషనర్, శంషాబాద్) 7337336191అమర్ లింగం గౌడ్, ఏఈఆర్ఓ (తహసీల్దార్, శంషాబాద్) 9849904287

## నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలి



గాయిత్రినగర్‌లో శివరేజ్ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్.

యూసుఫ్‌గూడ, 10 జులై, ప్రభాతవార్త : చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులు త్వరగా పూర్తి చేయాలని అల్లాపూర్ మాజీ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని గాయిత్రినగర్ 60 ఫీట్ల రోడ్డులో గాంధీ విగ్రహం వెనుక భాగంలో జరుగుతున్న శివరేజి లైన్ పునరుద్దరణ పనులు పరిశీలించారు. గతంలో ఏర్పాటు చేసిన శివరేజ్ లైన్లు అధ్వానంగా తయారవడంతో స్థానికంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటి జనాభా దృష్టిలో ఉంచుకుని పైప్‌లైన్ సామర్థ్యం పెంచుతూ పనులు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కృష్ణారావు, మాజీ అధ్యక్షులు సంజీవరెడ్డి, కాశీనాథ చారి తదితరులు పాల్గొన్నారు.

## రూ.13 కోట్ల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు



మంత్రి శ్రీధర్‌బాబుకు నివేదికను అందజేస్తున్న శ్రీశైలంగౌడ్

జీడిమెట్ల, జులై 10, ప్రభాతవార్త జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును శుక్రవారం వారి నివాసంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ కలిసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన సమగ్ర నివేదికను అందజేశారు. గాజులరామారం, కొంపల్లి సర్కిళ్ల పరిధిలో రూ.13 కోట్ల వ్యయంతో చేపట్టాల్సిన అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను త్వరితగతిన మంజూరు చేయాలని నివేదికలో కోరారు. నివేదికను పరిశీలించిన మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందిస్తూ, ప్రతిపాదనలను స్థానిక సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజనకు పంపించి, అవసరమైన ప్రక్రియ పూర్తి చేసి వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

### ప్రతి శనివారం గృహ వ్యర్థాల ప్రత్యేక సేకరణ

జీడిమెట్ల, జులై 10, ప్రభాతవార్త గాజులరామారం వార్డు ప్రజల కోసం ప్రతి శనివారం భారీ గృహ వ్యర్థాల (బల్క్ వ్యర్థాలు) ప్రత్యేక సేకరణ కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు నిర్వహిస్తున్నారు. ఇళ్లలో ఉపయోగం లేకుండా ఉన్న పాత చెక్క మంచాలు, పరుపులు, సోఫాలు, కుర్చీలు, అల్మారాలు తదితర భారీ వస్తు వులను రోడ్లపై లేదా ఖాళీ స్థలాల్లో పడేయకుండా ఈ సేవను వినియోగించుకోవాలని కుత్బుల్లాపూర్ జోన్ డిప్యూటీ కమిషనర్ వెంకట్ రాములు విజ్ఞప్తి చేశారు. భారీ వ్యర్థాల సేకరణ కోసం ప్రజలు మున్సిపాలిటీ విడుదల చేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలి. అందిన ఫిర్యాదుల ఆధారంగా ప్రతి శనివారం మున్సిపల్ సిబ్బంది నేరుగా ఇంటి వద్దకే చేరుకుని భారీ వ్యర్థాలను ఉచితంగా సేకరిస్తారు. గాజులరామారం వార్డును పరిశుభ్రంగా, స్వచ్ఛంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ పాఠశాల బాలికల కోసం ఉచిత ఆఫ్టర్ స్కూల్ ప్రోగ్రాం



ఉచిత ఆఫ్టర్ స్కూల్ ప్రోగ్రాం ప్రారంభించిన దృశ్యం

నిజాంపేట్, జులై 10, ప్రభాతవార్త ప్రగతి నగర్‌లోని సుందరయ్య భవన్‌లో ప్రభుత్వ పాఠశాల బాలికలకు విద్యా ప్రోత్సాహం అందించేందుకు ఉచిత ఆఫ్టర్ స్కూల్ ప్రోగ్రాం (ట్యూషన్స్) ఘనంగా ప్రారంభమైంది. శ్రీ కళ్యాణ్ ఫౌండేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో, లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, జన విజ్ఞాన వేదిక, సుందరయ్య భవన్ కమిటీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యలో మెరుగైన ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. సుందరయ్య భవన్ కమిటీ అధ్యక్షుడు మల్లయ్య చారి మాట్లాడుతూ ఈ కార్యక్రమం విద్యార్థినుల విద్యా నైపుణ్యాలను పెంపొందించి ఉన్నత లక్ష్యాల సాధనకు దోహదపడుతుందని అన్నారు. లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ కె. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థినుల వ్యక్తిత్వ వికాసానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లేష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం బాల వెంకటేశ్వర్ రావు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, రాజేశ్వరరావు, కృష్ణ శ్రీ, సాధనాల వెంకటస్వామి నాయుడు, నవీన్, ఆఫ్టర్ స్కూల్ ప్రోగ్రాం ఉపాధ్యాయిని ఐశ్వర్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

## పేట్‌బషీరాబాద్‌లో కబ్జాలను తొలగించిన హైడ్రా

**1.30 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్**

హైదరాబాద్, జులై 10,ప్రభాతవార్త: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం పేట్ బషీరాబాద్‌లోని ప్రభుత్వ భూమి ఆక్రమణలను హైడ్రా శుక్రవారం తొలగించింది. సర్వే నంబరు 25/2లఓ మొత్తం 38.15 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. హెచ్ఎండీఏ ఆధీనంలో ఉన్న ఈ భూమిని జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి కేటాయించారు. ఆ స్థలం కబ్జాలు పాలవ్వకుండా గతంలో 36.25 ఎకరాల మేర హైడ్రా ఫెన్సింగ్ వేసింది. అక్కడ సెయింట్ ఆన్స్ హైస్కూల్ నిర్వాహకులు 1.30 ఎకరాల ప్రభుత్వ భూమిని వారి స్వాధీనంలో ఉంచుకుని క్రీడామైదానంగా వినియోగిస్తున్నారు. అప్పట్లో విద్యాసంవత్సరం పూర్తయ్యేవరకు సమయం ఇవ్వాలని హైస్కూల్ నిర్వాహకులు కోరారు. విద్యా సంవత్సరం పూర్తయ్యాక కూడా ఆ స్థలం చుట్టూ నిర్మించిన ప్రహారీని తొలగించకపోవడంతో హైడ్రా శుక్రవారం చర్యలు తీసుకుంది. ప్రహారీని తొలగించి ప్రభుత్వ భూమి ఉన్నంతమేర ఫెన్సింగ్ వేసింది. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది.


**వార్త VAARTHA CLASSIFIEDS**

**CLASSIFIEDS**

**CHANGE OF NAME**

★ I, Hameed Khan, R/o. 2-3-593, Patel Bada, Amberpet, Hyd. TG. Changed My Name as Mohammed Hameed Khan S/o. Mohammed Osman Khan.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.


**IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT SECUNDERABAD**
**O.S.No. 435 of 2A26**

Between:
**Smt. Haritha Pal & Others** ...Plaintiffs
AND
**Tahsildhar, Tirumulgheery Mandal & Another** ...Defendants

**NOTICE**

To
**All Concerned ...Defendant No.2**

Please take notice that, the Plaintiffs filed the above suit against you for declaration of Plaintiffs as legal heirs of Late Aerolla Hari Babu and Late Aerolla Jayaprada and the same is posted on **28.07.2026.** That the general public who ever may concerned can appear before the above said Hon'ble Court on **28.07.2026 at 10.30** AM with objections if any in support of your claim or else the Hon'ble Court will proceed for granting legal heirs certificate in favour of the Plaintiffs.

// BY ORDER OF THE COURT //

**Sd/- H. DAYANAND,**
**I. SRINIVAS & CH. NIHARIKA**
**Advocates**
H.No. 10-456/2, PVN Colony, Malkajgiri, Hyderabad - 500047
**Cell No. 8555998931**
Date: 11-07-2026

**IN THE COURT OF THE HON'BLE IV SENIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD**
**O.S. NO. 795 OF 2025**

BETWEEN:
**G. Harikishan Reddy & another** ... PLAINTIFFS
AND
**Pattola Vamshevardhan Reddy and others** ...DEFENDANTS

To,
**Smt. Gummakonda Vanaja Reddy**
W/o. Late G. Narsimha Reddy
R/o. H.No.4910, Road No.19,
Vidyuthnagar, Phase-2,
Ramchandrapuram, Sangareddy District-502032 **(Defendant No.3)**
Sir/Madam,

Please take notice that the plaintiff filed the above suit for RECOVERY OF MONEY on the file of the Hon'ble IV Senior Civil Judge, City Civil Court at Hyderabad, against Defendants 1 to 3. That you have been arrayed as Defendant No.3 therein. Notice in the ordinary course of service could not be served on you in the above suit, as such Hon'ble Court ordered for substituted service to you. The above case is posted to **03-08-2026 at 10-30 AM** for your appearance. If you fail to be present or represented by any advocate on the said date and time the case will be decided in your absence.

(By Order of the Court)

**I. RAMESH, Advocate**
**Chambers At:** "Sri Sai Nilayam", 9-1-19/48 Vinayak Nagar, Langer House HYDERABAD-500008
**Mobile: 9246546715**

తెలంగాణ ప్రభుత్వం
**మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం (M), MMC(HQ), తార్నాక హుడా కాంప్లెక్స్, హైదరాబాద్
ఇ-మెయిల్ eem.mulhq@gmail.com

**కొటేషన్ ప్రకటన**

కొటేషన్ ప్రకటన నం. **09/EE/MMC(HQ)/2026-27/**, తేది: **10-07-2026.** సీల్డ్ కొటేషన్‌లు, క్రింద పేర్కొన్న పని విషయమై క్రింది సంతకందారునికి 13.07.2026న లేదా ముందు చేరేటట్లుగా పేరొందిన సంస్థల నుండి ఆహ్వానించబడుతున్నవి. కొటేషన్ 13.07.2026న లేదా ముందు సా.4.00 గం. వరకు స్వీకరించబడును మరియు వాటిని సా.4.30 గం. వద్ద తెరువబడును. ఇతర వివరాలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (M) నుండి కార్యాలయం వేళలలో పొందవచ్చును.

| క్ర. సం. | వివరణ | కొటేషన్ కావలసినది |
|---|---|---|
| 1. | 450x50x 2 MM GI నిచ్చెన రకం కేబుల్‌ట్రే దానికి అవసరమైన కప్లర్ ప్లేట్స్, Tలు, బెండ్స్, రెడ్యూసర్స్, యాంకర్ బోల్ట్స్, నట్స్, వాషర్స్ మరియు స్లాటెడ్ ఛానల్స్/యాంగిల్ ఐరన్ ఛానల్స్, వగైరాలతోసహా సరఫరా, రవాణా మరియు స్థాపన అది సంపూర్తిగా. మరియు ఆ ట్రేను గోడపైన/సీలింగ్ వగైరా పై బిగించవలెను. సంపూర్తిగా పని యొక్క ఐటమ్ పూర్తి చేయుటకు. తయారీలు: DEC / MNR / Aparna / H FAB లేదా సమానం. | రేట్ / Rmt |
| 2. | డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల నిర్వహణకు ఆగస్టు 2026 నుండి మార్చి 2027 వరకు మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్‌కు సోషల్ మీడియా సర్వీస్‌ల నియామకం. ఈ క్రింది స్ట్రక్చర్ ప్రకారం టీమ్‌ను వినియోగించవలెను. టీమ్ నిర్మాణం వీరితో 1) సోషల్ మీడియా మేనేజర్-ఇన్-ఆఫీస్ 2) కెమెరా మ్యాన్-ఇన్-ఆఫీస్ 3) వీడియో ఎడిటర్-రిమోట్ 4) కంటెంట్ రైటర్ (తెలుగు)-రిమోట్ 5) గ్రాఫిక్ డిజైనర్-రిమోట్ 6) వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్-రిమోట్ ముగ్గురు సభ్యుల ఒక టీమ్ పూర్తి కాలం MMC ఆఫీస్‌లో ఉండవలెను, మిగిలిన టీమ్ సభ్యులు రిమోట్‌లో సపోర్ట్‌గా ఉండవలెను. | రేట్ / నెల |

నిబంధనలు:-
1. కొటేషన్‌లు 13.07.2026న లేదా ముందు సా.4.00 గం. వరకు స్వీకరించబడును మరియు వాటిని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, MMC (HQ), హుడా కాంప్లెక్స్, తార్నాక, హైదరాబాద్ కార్యాలయంలో సా.4.30 గం. వద్ద తెరువబడును. 2. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (M),MMC(HQ), వారు ఏ కారణం చెప్పనక్కర్లేకుండానే కొటేషన్‌లను రద్దు చేయటానికి హక్కు రిజర్వ్ అయి ఉన్నది.
సంబంధిత అధికారి చిరునామా:
శ్రీ కె. రమేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (M), MMC(HQ), తార్నాక, హైదరాబాద్

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (M), మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్ (HQ), తార్నాక
DIPR.No.5885-PP/CL/Advt/1/2026-27, తేది: 10.07.2026

## సత్తి రెడ్డి నగర్‌లో నాలాను పరిశీలించిన ప్రేమ్ కుమార్



**మల్కాజిగిరి జులై10, ప్రభాతవార్త :**
ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని సత్తి రెడ్డి నగర్ లో నాలాను మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్తి రెడ్డి నగర్ నుండి లాలా పేట్ లక్ష్మీ నగర్ వరకు ఉన్న కనెక్టింగ్ నాలా బాక్స్ డ్రైన్ కొరకు 40 మీటర్లు కావాలని ప్రపోజల్స్ సిద్ధం చేయాలని సంబంధిత అధికారుల తో ఫోన్ లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని తెలిపారు. తద్వారా పి వి ఎన్ కాలనీ, సత్య రాఘవేంద్ర కాలనీ నాలా నుండి వచ్చే డ్రైనేజీ వాటర్ సమస్య పరిష్కారం అవుతుంది ఈ కార్యక్రమంలో బాబు, కిషోర్, అసోసియేషన్ సభ్యులు వినయ్, శ్రీనివాస్ రెడ్డి, సునీల్ అశోక్ కుమార్, కొమురయ్య, రవి, స్వామి నాథన్, అంబాజీ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల అభ్యున్నతి కోసం కృషి : సలాం షాహిద్



రోడ్డు నిర్మాణం పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ సలాం షాహిద్

**మలక్ పేట ,జూలై 10, ప్రభాతవార్త:**
ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి అభ్యున్నతి కోసం కృషి చేస్తామని చావుని డివిజన్ మాజీ కార్పొరేటర్ సలాం షాహిద్ పేర్కొన్నారు. డివిజన్లోని శాంతినగర్ లో కొనసాగుతున్న రోడ్డు నిర్మాణం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం పనులలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. డివిజన్ ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోచమ్మ దేవాలయంలో ఘనంగా నాగ విగ్రహ ప్రతిష్టపాన



నాగ దేవత విగ్రహ ప్రతిష్టపాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న చౌకి సురేష్ కుమార్, దేవాలయం చైర్మన్ బాబు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ తదితరులు

**మలక్ పేట, జూలై 10, ప్రభాతవార్త:**
మలక్ పేటలోని శ్రీ పోచమ్మ దేవాలయంలో నాగదేవత విగ్రహ పునః ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. విగ్రహదాత చౌకి తులసి సురేష్ కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ చైర్మన్ బాబు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చౌకీ రవికుమార్ లు మాట్లాడుతూ దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శివకుమార్, బాలరాజ్, సోదిరాజు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ వైద్య విధాన పరిషత్‌కు పూర్తి బాధ్యతలతో కమిషనర్‌ను నియమించాలి




మలక్ పేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్న మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు మూర్తి తదితరులు

**మలక్ పేట, జూలై 10,ప్రభాతవార్త:**
తెలంగాణ వైద్య విధాన పరిషత్ ( సెకండరీ హెల్త్ సర్వీసెస్ ) కు సంబంధించి తక్షణమే పూర్తి బాధ్యతలతో కమిషనర్ ను నియమించాలని మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎం. ఎస్. మూర్తి పేర్కొన్నారు. మలక్ పేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద తెలంగాణ వైద్య విధాన పరిషత్ కు సంబంధించి తక్షణమే పూర్తి బాధ్యతలతో కమిషనర్ ను నియమించాలని కోరుతూ యూనియన్ నాయకులు నిరసన ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ఎస్ మూర్తి, యూనియన్ నాయకులు రాధా, స్వర్ణలత, నళిని, జగన్, అన్నపూర్ణ, సుమతి, రమనేశ్వరి, మాధవి,వైష్ణవి, కిరణ్ , బాబు రావు, హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు

## రేణుక ఎల్లమ్మ దేవాలయానికి రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలి



**మల్కాజిగిరి జులై10, ప్రభాతవార్త :**
మల్కాజ్గిరి నియోజకవర్గంలోని మీర్జల్‌గూడలో ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం సమీపంలో రైల్వే ప్రహరీ గోడ నిర్మాణం చేపడుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజలు, కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి స్పందించారు. శుక్రవారంఈ మేరకు హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్ కుమార్ వర్మని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. రైల్వే ప్రహరీ గోడ నిర్మాణం కారణంగా శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయానికి వెళ్లే ప్రధాన రాకపోకల మార్గం మూసివే యబడే పరిస్థితి ఏర్పడిందని, దీనివల్ల భక్తులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని వివరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బోనాల పండుగకు శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయానికి విశేష ప్రాధాన్యం ఉందని, వేలాది మంది భక్తులు ఆలయాన్ని దర్శించుకునే నేపథ్యంలో రైల్వే అధికారులు తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రహరీ గోడ నిర్మాణంలో అవసరమైన మార్పులు చేసి, ప్రజల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ఆలయాన్ని పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే విజ్ఞప్తికి హైదరాబాద్ డీఆర్ఎం సంతోష్ కుమార్ వర్మ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎడిఆర్ఎంరామారావు రైల్వే అధికారులు, బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, జేపీస్ వెంకన్న, బిక్షపతి, హేమంత్ పటేల్, నర్సింగ్ రావు, రేణుక ఎల్లమ్మ దేవాలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.47.03 కోట్లతో అంతర్జాతీయ మార్కెట్ హబ్‌గా కోహెడ : మంత్రి వాకిటి శ్రీహరి

**తుర్కయంజాల్, జూలై 10 (ప్రభాతవార్త)**
నేషనల్ ఫిష్ ఫార్మర్స్ డే సందర్భంగా జీహెచ్ఎంసీ ఆదిభట్ల సర్కిల్ తొర్రూర్ డివిజన్ కోహెడ గ్రామంలో రూ. 47.03 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఎగుమతి ఆధారిత హోల్‌సేల్ చేపల మార్కెట్‌కు రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి శుక్రవారం మాట్లాడుతూ, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్లు తెలిపారు. కోహెడ గ్రామం లో ప్రభుత్వ భూమి 13 ఎకరాలలో ఈ మార్కెట్ నిర్మాణం పూర్తయితే దేశంలోనే ప్రముఖ చేపల ఎగుమతి కేంద్రంగా ఎదగడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్ హబ్‌గా గుర్తింపు పొందుతుందని పేర్కొన్నారు. రోజుకు 200 మెట్రిక్ టన్నుల చేపల నిల్వ సామర్థ్యం, 10 మెట్రిక్ టన్నుల ఎగుమతి సామర్థ్యంతో ఈ మార్కెట్ దక్షిణ భారతదేశంలోనే అత్యాధునిక చేపల మార్కెట్‌గా నిలవనుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 2,000 స్థానిక కుటుంబాలకు ప్రత్యక్ష, పరోక్ష




ఉపాధి అవకాశాలు లభించనున్నాయని, ఏటా రూ.500 కోట్లకు పైగా ఆర్థిక లావాదేవీలు జరిగే అవకాశం ఉందని వెల్లడించారు. మత్స్యకారుల ఆదాయం పెరగడంతో పాటు రాష్ట్ర చేపల ఎగుమతులకు కూడా ఈ మార్కెట్ కీలకంగా మారుతుందని అన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డైరెక్టర్ ఐఏఎస్ కె. నిఖిల, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ, టీపీసీసీ కార్యదర్శి కొత్తకుర్మ శివకుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కరాచారి, తొర్రూర్ డివిజన్ అధ్యక్షుడు కోసికె ఐలయ్య, తుర్కయంజాల్ డివిజన్ అధ్యక్షుడు ఓర్సు శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, ఎమ్మార్వో సుదర్శన్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

## రామంతాపూర్ పెద్ద చెరువును పరిశీలించిన కాంగ్రెస్ నేతలు

**రామంతాపూర్, జూలై 10 ప్రభాతవార్త :** రామంతాపూర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ హబ్సిగూడ, రామంతాపూర్, వెంకట్‌రెడ్డినగర్ అధ్యక్షులు కంది శ్రవణ్‌కుమార్‌రెడ్డి, సందీప్, నామ్ రాజిరెడ్డి, వల్లపు శ్రీకాంత్ యాదవ్ తదితరులు పలువురు పార్టీ నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్ద చెరువు వద్ద సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు పనులు పరిశీలించినట్లు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి సిఎం రేవంత్ రెడ్డి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. 18.23 ఎకరాల రామంతాపూర్ పెద్ద చెరువు చుట్టు పక్కల ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.19 కోట్లు కేటాయించారని తెలిపారు. హైడ్రా చేపట్టిన ఈ పనులతో ఏ ఒక్కరికీ నష్టం వాటిల్లదని హామీ ఇచ్చారు. ఈ నిధులతో బతుకమ్మ కొలను, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నట్టుగా చెప్పారు. రామంతాపూర్ పెద్ద చెరువు సుందరీకరణ పనుల కోసం భారీగా ఎత్తున నిధులు కేటాయించి, త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామంతాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ సం



రామంతాపూర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులు పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు కంది శ్రవణ్‌రెడ్డి, వల్లపు శ్రీకాంత్, సందీప్, రాజిరెడ్డి తదితరులు

దీప్ పటేల్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జలీల్ పాషా, వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ ప్రెసిడెంట్ నామ్ రాజిరెడ్డి, డీసీసీ కార్యదర్శి బాలయ్య బాబు, భాస్కర్, శాగ శ్రీధర్, గరిక సుధాకర్, హబ్సిగూడ డివిజన్ నాయకులు రొండ్ల దామోదర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ ధర్మా నాయక్, అశోక్, సంధ్యారాణి, అంబికా గౌడ్, సీనియర్ నాయకులు మురళీ కృష్ణ ముదిరాజ్, రాజు నాయక్, జావేద్, గుండు రాజన్న, మాలు నాయక్, యూత్ ప్రెసిడెంట్ వాసు నాయక్, వంగూరి నర్సింగ్ రావు, లక్ష్మీ నారాయణ, సాయి కుమార్, సుమన్ నాయక్, శివ, అనిల్ మామిడాల, ఉమేష్, రంజిత్. సచిన్, జంగయ్య, శ్యాముల్, మింటూ గౌడ్, చింటూ, శోభ, శ్రీలత, చైతన్య, ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా క్లబ్‌కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేవిధంగా కృషి చేస్తాం : కృష్ణారెడ్డి

**కుషాయిగూడ, జూలై 10, ప్రభాతవార్త**
ఫోకస్ , సర్వ్ కనెక్ట్ అనే అరుదైన అద్భుతమైన కార్యక్రమాలతో దృష్టి జిల్లా క్లబ్ ను అన్ని రంగాలలో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు వచ్చే విధంగా ముందుకు తీసుకెళ్తామని లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ గవర్నర్ కళ్లెం కృష్ణారెడ్డి పేర్కొన్నారు. 2026-27 సంవత్సరానికి గాను డిస్టిక్ 320సి గవర్నర్గా ఎన్నికైన కళ్లెం కృష్ణారెడ్డి హాంగ్ కాంగ్ లో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో సతీ సమేతంగా పాల్గొని ప్రమాణ స్వీకారం పూర్తిచేసుకుని వచ్చిన అనంతరం ఈసీఐఎల్ నుండి రాధిక చౌరస్తా వరకు డిస్టిక్ లైన్స్ క్లబ్ లు డిస్టిక్ క్యాబినెట్ భారీ ర్యాలీ నిర్వహించి, రాధిక సాగర్ గ్రాండ్ లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యులందరూ మీ సేవ కార్యక్రమాల్లో భాగస్వాములను చేసే క్రమంలో సభ్యత్వ వృద్ధి సేవా కార్యక్రమాల విస్తరణ ఎల్సిఐఎఫ్ బలోపేతం నాయకత్వ వికాసం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320ది జిల్లా గవర్నర్‌కు ఘన స్వాగతం లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320 సి నూతన జిల్లా గవర్నర్ లయన్ కళ్లెం కృష్ణా రెడ్డి , ప్రథమ మహిళ లయన్ లలితా రెడ్డి గారికి హాంకాంగ్‌లో జరిగిన లయన్స్ ఇంటర్నేషనల్ 108వ అంతర్జాతీయ మహాసభలో జిల్లా గవర్నర్‌గా విజయవంతంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సందర్భంగా జిల్లా గవర్నర్



ప్రమాణ స్వీకారానికి విచ్చేసిన గవర్నర్ కృష్ణారెడ్డి ఘన స్వాగతం పలుకుతున్న దృశ్యం...

దంపతులను పుష్పగుచ్ఛాలు, శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. హాంకాంగ్ అంతర్జాతీయ మహాసభలో జిల్లా 320దికి లభించిన చార్టర్ చాలెంజ్ అవార్డు జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. జిల్లా క్యాబినెట్ సెక్రటరీ లయన్ కళ్లెం మోహన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా గవర్నర్ గారికి జిల్లా సభ్యుల తరపున హృదయపూర్వక స్వాగతం పలికి, జిల్లా అభివృద్ధికి ప్రతి క్లబ్ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ గవర్నర్లు సురేష్ కుమార్ మండ, గుంటుక శేఖర్ రెడ్డి మరియు పి డి జి లు పి. సూర్యనారాయణ బిఆర్ రావు, వి కృష్ణ ప్రసాద్, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ ట్రెజరర్ శ్రీనివాసరావు మూలవర్తి, ప్రేరణ టీం కోఆర్డినేటర్ పావని మహిపాల్ రెడ్డి, ర్యాలీ స్ కోఆర్డినేటర్ నవీన్ యాదవ్, రీజియన్ చైర్‌పర్సన్లు, జోన్ చైర్‌పర్సన్లు, క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు మరియు పెద్ద సంఖ్యలో లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

## నిత్యం ప్రయాణం నరకం...కోట్ల రూపాయల పనులు వృధా

### -పరిష్కారానికి నోచుకోని సమస్య
### -కాలనీవాసుల అగచాట్లు

**ఎల్.బి.నగర్, జులై 10 ప్రభాతవార్త:**
ప్రజల ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థ నిత్యం కూలిపోతూ ప్రజలకు నరకం చూపిస్తోంది. నాలా నిర్మాణం పనుల్లో ఇంజనీరింగ్ విభాగం అధికారులు సరైన ప్రణాళిక రూపొందించకపోవడం, నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్ల కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది. కోట్లు ఖర్చు చేసిన సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోక ప్రజలు నానా తిప్పలు పడుతున్నారు. నాగోల్ డివిజన్ జైపురికాలనీ వద్ద మురుగునీటి పైపుల నిర్మాణం పనులను ఏడాది క్రితం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించారు. సరైన నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో జైపూరికాలనీ వద్ద నిత్యం నాలా కూలిపోతుంది. ఇప్పటికీ మూడుసార్లు నాలా కూలిపోవడంతో లక్షల ఖర్చు చేసి పునర్నిర్మాణం పనులు చేపట్టారు. అయినప్పటికీ నాలా పైప్‌లైన్ కూలిపోయి నేడు ఇనుప సువాలు పైకి తేలి ప్రమాదకరంగా యధాస్థితికి వచ్చింది. భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఏమిటి అని కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. పైకాలనీల నుంచి మూసి లోకి ప్రవహించే విధంగా పైప్‌లైన్ నిర్మాణం చేపట్టిన అధికారులు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్లక్ష్యంగా పనులు చేయడం వల్లే నిత్యం నాలా కూలిపోతుందని స్థానిక బిఆర్ఎస్ నాయకుడు శ్యామల యాదగిరివంశరాజ్ ఆరోపించారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు కొనసాగించే ఈ ప్రాంతంలో పైప్ లైన్ నిర్మాణం పనులు పటిష్టంగా చేపట్టకపోవడం వల్లే తరచు డ్రైనేజీ నాల కూలిపోతుందని కాలనీవాసులు అధికారుల తీర్పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని స్థానికులు ఎమ్మెల్యే, అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని వారి పట్ల కాలనీవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణం వల్ల కాంట్రాక్టర్లకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు మాత్రమే లాభం ఉందని, కాలనీవాసులకు మాత్రం ఎటువంటి లాభం లేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



నాలా స్లాబ్ కూలి ఇనుప సువ్వలు బయటికి వచ్చిన దృశ్యం

## ఎస్ఐఆర్ ప్రక్రియలో బిఆర్ఎస్ శ్రేణులు ఓటర్లకు ఆసరాగా ఉండాలి : సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, జూలై 10 ప్రభాతవార్త:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై బిఆర్ఎస్ శ్రేణులు దృష్టి సారించాలని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి సూచించారు. నియోజకవర్గంలోని జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులో తన క్యాంపు కార్యాలయానికి సమీపంలోనున్న శ్రీరస్తు కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఆమె ఎస్ఐఆర్‌పై పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం, దాని ఉద్దేశ్యం, లక్ష్యం, కొనసాగుతున్న ప్రక్రియ, ఓటర్లకు ఎదురవుతున్న ఇబ్బందులు, పరిష్కారానికి పార్టీ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై ఆమె సుదర్ఘీంగా చర్చించి సమీక్ష జరిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎస్ఐఆర్ పట్ల అప్రమత్తత అవసరమని ఆమె వ్యాఖ్యానించారు. అర్హులైన ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియ సందర్భంగా పార్టీ శ్రేణులు అండగా ఉండి సహాయ సహకారాలు అందించాలని ఆమె సూచించారు. జరుగుతున్న ప్రక్రియను సునిశితంగా పరిశీలిస్తూ ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు నింపే క్రమంలో వివరాలను ఓటర్లు సక్రమంగా పూరించే విధంగా చూడాలని ఆమె అన్నారు. ఏ ఒక్క ఓటరు కూడా మిస్ కాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. నిర్దేశిత గడువులోగా మహేశ్వరం నియోజకవర్గంలోని ఓటర్లందరూ ఎన్యూమరేషన్ ఫారాలు నింపి బిఎల్ఓలకు అందించడంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉండి సహకారం అందించాలని సబితారెడ్డి దిశా నిర్దేశనం చేశారు. రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ యువ నాయకుడు పట్లోళ్ళ కౌశిక్‌రెడ్డి హాజరైన ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ఆయాచితం శ్రీధర్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, సరూర్‌నగర్ మాజీ ఎంపిపి జిల్లెల కృష్ణారెడ్డి, మీర్‌పేట్ బిఆర్ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, దీప్‌లాల్ చౌహాన్, నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, మీర్‌పేట్ సెక్టార్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డితో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సర్‌పై బిఆర్ఎస్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశనం చేస్తున్న సబితా ఇంద్రారెడి

## మంత్రి దామోదర రాజనరసింహాతో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బేటి



మంత్రి దామోదర రాజనరసింహాకు వినతి పత్రం అందజేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, జూలై 10 ప్రభాతవార్త :**
రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సి. దామోదర రాజనరసింహాతో శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బేటి అయ్యారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గంలోని పలు పేద మరియు మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో బస్తీ దవాఖానల ఏర్పాటు కోసం వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీల్లో బస్తీ దవాఖానలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ దవాఖానల ద్వారా పేద ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు, ప్రాథమిక చికిత్సలు, అవసరమైన మందులు సకాలంలో అందించడంతో పాటు ఆరోగ్య సేవలు మరింత చేరువ అవుతాయని ఎమ్మెల్యే వివరించారు. దీనిపై మంత్రి దామోదర్ రాజనరసింహ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## అగమ్య గోచరంగా ఎస్ఐఆర్



పత్రాలను పంపిణీ చేస్తున్న బొడుపల్లి కృష్ణ

**ఎల్.బి.నగర్, జులై 10 ప్రభాతవార్త:**
ఎస్ఐఆర్ నిర్వహణ అగమ్యగోచరంగా మారిందని సిపిఐ రాష్ట్ర సబ్ కమిటీ సభ్యులు బొడుపల్లి కృష్ణ పేర్కొన్నారు. నాగోల్ లో సోమవారం పలు కాలనీలలో ఎస్ఐఆర్ పత్రాలను పంపిణీ చేశారు. దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని, ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను ఎల్బీనగర్ నియోజకవర్గంలోని వార్డులు, బూతుల వారీగా పరిపూర్తి చేయుటకు నియమించిన బి.ఎల్.ఓ లు అందుబాటులో ఉండట్లేదని, ఉన్నవారికి అవగాహన సరిగ్గా లేదన్నారు. ప్రజలే బి.ఎల్.ఓలు ఎక్కడ కూర్చున్నారని వెతుక్కుంటున్నారని, బి.ఎల్.ఓలు కూర్చున్న కమ్యూనిటీ భవనాల వద్ద, ఆఫీస్ ల వద్ద వందలాది పత్రాలు పడి ఉన్నాయన్నారు. పడి ఉన్న పత్రాలు ఆకుప్పల్లో వెతుకుతున్న స్థానిక ఓటర్లు తీసుకున్న ఫారం ఎలా నింపాలో అర్థం కాక నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిరక్షరాసులు, రెక్కాడితే గాని డొక్కాడని రోజువారి కూలీలు, మధ్యతరగతి ఓటర్లు నేటికీ అందని ఫారాలు, స్థానిక ఓటర్లు కు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్న కొంతమంది బిఎల్వోలు, వీరి పైఅధికారుల పర్యవేక్షణ లేకపోవడం ఇబ్బందిగా మారిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమయం వృధా కాకుండా అందరికీ పత్రాలు అందజేసి వాటిని పూర్తి చేసే విధంగా సహాయ సహకారాలు అందించాలని సూచించారు.

## తాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలి



ఈడికి సమస్యలు వివరిస్తున్న పరమేశ్వర్ రెడ్డి

**నాచారం, జులై 10 ప్రభాతవార్త :**
ఉప్పల్ నియో జకవర్గంలో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి హెచ్ఎండబ్ల్యు ఎస్ఎస్‌బీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పంకజను కలిసి వినతి పత్రం అందజేశారు. మ ల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ మల్లాపూర్, ఎస్‌సీ కాలనీ, నరసింహ నగర్, హెచ్ బీ కాలనీ, రాజీవ్ నగర్, ఇంద్ర నగర్, బక్షిగూడ, మంగాపురం తదితర ప్రాంతాల్లో కొత్త తాగునీటి పైప్‌లైన్లు, భూగర్భ డ్రైనేజీ లైన్ల నిర్మాణం, దెబ్బతిన్న డ్రైనేజీ పునరుద్ధరణ, కలుషిత నీటి సమస్యల పరిష్కారం, టెండర్ పూర్తయిన పనుల ను వేగవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు కలుషిత నీరు, డ్రైనేజీ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్ర మంలో నాయకులు జమీలా బేగం, కాప్రా సాయి గౌడ్, నెమలి అనిల్, ఎస్‌వీ కిట్టు, బెల్లం శ్రీనివాస్, టిల్లు ముదిరాజ్, జానీ, సుధాకర్, డేవిడ్, ఆరోగ్యమ్మ, రోజ్ మేరీ, సతీష్, కార్తీక్, సుమలత అలీమ్, జెమిని, నాగేశ్వర్ రావు, వెంకట్ రెడ్డి తదితరులు, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

## గంజాయి గొడవలు.. యువతి వివాదమే సుహాస్ హత్యకు కారణం

**హయత్ నగర్, జులై 10 ప్రభాతవార్త :** స్నేహితులు పిలిచారని అర్ధ రాత్రి ఇంటి నుండి బయటకు వెళ్లిన యువకుడిని ఆ స్నేహితులే దారుణంగా కొట్టి చంపారు. నాలుగు రోజుల క్రితం హయత్ నగర్ పోలీస్ స్టేష న్ పరిధి పెద్ద అంబర్ పేట నుండి పసుమముల వెళ్లే దారిలో అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన సుహా స్(22) కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. గంజాయి విక్రయాల్లో తేడాలు, యువతి విషయంలో వివాదమే అతని హత్యకు దారితీసినట్లుగా తెలుస్తోంది. సికింద్రాబాద్ లో నివాసముండే సమయంలో గంజాయికి బానిసైన సుహాస్ ను ఆ వ్యసనం నుండి బయట పడేసేందుకు అతని తల్లి పసుమాములకు నివాసం మార్చింది. అయినా కొందరు స్నేహి తులతో అతను అవారాగా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో తనకు సెల్ ఫోన్ లేకపోవడంతో స్నేహితుడి ఫోన్ నుండి ఇన్స్టా గ్రామ్‌లో స్నేహితుడు ప్రేమిస్తున్న యు వతికి సందేశాలు పంపాడు. ఆమెతో ఫోన్ లో అసభ్యంగా మాట్లాడాడు. విషయం తెలుసుకున్న యువతి బాయ్ ఫ్రెండ్ గంజాయి విక్రయాల సమయంలో పాత కక్షలు, యువతి విషయం రెండు మనసులో పెట్టుకుని స్నేహి తులతో కలిసి సుహాస్ ను హత్య చేసేందుకు ప్లా న్ చేశారు. బుధవారం అర్ధ రాత్రి సమయంలో సుహాస్ తల్లికి ఫోన్ చేసి సుహాస్ ను బయటకు రమ్మని పిలిచారు. గ్రామ శివారు నిర్మానుష ప్రాంతానికి తీసుకువెళ్లి అతనిపై దాడి చేశారు. సుహాస్ తప్పించుకునేందుకు యత్నించినా వెంటపడి విచక్షణ రహితంగా శరీరం, మార్మాంగాలపై కొట్టి హత్య చేశారు. అనంతరం మృత దేహాన్ని పసుమాముల రోడ్డులో స్మశాన వాటిక పక్కన సిమెంట్ బెంచ్ మీద పడేసి వెళ్లిపోయారు. నిందితుల్లో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మిగతా వారు పరారీలో ఉన్నట్లు సమాచారం. తండ్రి చనిపోయాక కుమారుడిని సన్మార్గంలో పెట్టడానికి ఊరు మారినా తన కొడుకు దక్కలేదని సుహాస్ తల్లి లబో దిబోమని ఏడుస్తోంది.

## ఉద్యమ కారుల గుర్తింపు పారదర్శకంగా ఉండాలి



**మన్సూరాబాద్, జూలై 10 , ప్రభాతవార్త:**
తెలంగాణ ఉద్యమ కారుల గుర్తింపు పారదర్శకంగా ఉండాలి అని తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిండిగ వెంకన్న అలియాస్ తెలంగాణ వెంకన్న కేకే కమిటీకి విజ్ఞప్తి చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన తెలంగాణ ఉద్యమ కారులు శుక్రవారం సరూర్ నగర్ డివిజన్ లో తెలంగాణ వెంకన్నను కలిసి ఉద్యమ కారుల గుర్తింపు విషయం గురించి చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ వెంకన్న మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ఉద్యమ కారులను గుర్తించడానికి కేకే కమిటీ విధి విధానాలు ప్రకటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఉద్యమ కారులను గుర్తించే విషయంలో కేకే కమిటీకి ఒక కాల పరిమితిని ప్రభుత్వం అధికారికంగా నిర్ణయించాలని తెలంగాణ వెంకన్న కోరారు. గత కొన్ని రోజులుగా వివిధ సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తున్న కేకే కమిటీ సభ్యులు ఆయా సంఘాల నాయకుల ప్రసంగాలు ఉపన్యాసాలు కాకుండా రాతపూర్వకంగా సలహాలు సూచనలు వినతి పత్రాలు తీసుకోవాలి అని విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా పాల్గొన్న ఉద్యమ కారులను గుర్తించడానికి ఉద్యమ కారులు ఒకే వేదికపై రావాలని తెలంగాణ ఉద్యమ కారుడు గంట సుదర్శన్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమ కారులు ఇరుగు కిరణ్, కొమ్ము రాజశేఖర్, మొండి కత్తి పరుశురాం, ఇరుగు నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ ఉద్యమ కారుడు తెలంగాణ వెంకన్నకు తెలంగాణ ఉద్యమ నాయకులు చిక్కుళ్ల శివ ప్రసాద్, గంట సుదర్శన్, ఇరుగు కిరణ్, కొమ్ము రాజశేఖర్, మొండి కత్తి పరుశురాం, నాగరాజు, తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## క్రీడలతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం



పికిల్ బాల్ కోర్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

**తార్నాక, జులై 10 ప్రభాతవార్త :** క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంచి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడతాయని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. తార్నాక విజయపురి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన పికిల్ బాల్ కోర్టును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి వేగవంతమైన జీవనశైలిలో శారీరక శ్రమ తగ్గిపోతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో క్రీడలకు సమయం కేటాయించాలని సూచించారు. ముఖ్యంగా యువత మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలకు పరిమితం కాకుండా క్రీడల్లో చురుకుగా పాల్గొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. పికిల్ బాల్ వంటి ఆధునిక క్రీడల పట్ల యువతలో పెరుగుతున్న ఆసక్తి అభినందనీయమని పేర్కొన్న ఆయన, నగరంలో మరిన్ని ఆధునిక క్రీడా వసతులు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. ఔత్సాహిక క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలు, ప్రోత్సాహం కల్పించేందుకు తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు. క్రీడలను కేవలం వినోదంగా కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని, ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు కూడా క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పికిల్ బాల్ కోర్టు యజమాని షెహజాన్ ముహమ్మద్, అఫ్సర్ రియాజ్, రాజు, జునీద్, శాంసన్, మూర్తి, కృష్ణరావు పాల్గొన్నారు.

## సమస్యాత్మక ప్రాంతాల్లో బిఎల్ఓలు, బిఎల్ఎలకు రక్షణ కల్పించాలని వినతి



కమిషనర్ సజ్జనార్‌కు వినతి పత్రం ఇస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, జూలై 10 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ సందర్భంగా సమస్యాత్మక ప్రాంతాల్లో బిఎల్ఓలు, బిఎల్ఎలకు తగిన భద్రత కల్పించాలని నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అందెల శ్రీరాములు యాదవ్ హైదరాబాద్ నగర పోలీస్ కమీషనర్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన రంగారెడ్డి జిల్లా రూరల్ బిజెపి అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపల్‌గౌడ్, భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ తదితరులతో కమీషనర్ సజ్జనార్‌ను కలిసి ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల పరిధిలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సందర్భంగా బిఎల్ఓలు, బిఎల్ఎలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఉండేందుకు అదే విధంగా ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు పోలీసు శాఖ తరపున తగిన చర్యలు తీసుకొని రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో అక్రమంగా రోహింగ్యాలు నివసిస్తున్నందున ఎస్ఐఆర్ ప్రక్రియ నేపథ్యంలో వారిపై నిఘా పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సమగ్రమైన తనిఖీలు చేయాలని ఆయన కమీషనర్‌ను కోరారు. నియోజకవర్గంలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో గత కొంత కాలం నుండి మిస్సింగ్ అవుతున్న మహిళలు, యువతులకు సంబంధించిన కేసులపై లోతైన దర్యాప్తు చేయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో బాధిత కుటుంబాలకు పోలీసు శాఖ తరపున న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.